ప్రజాశక్తి
శనివారం 15 మార్చి 2025 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల

అంబేద్కర్ స్ఫూర్తితో ముందుకు..

- సంక్షేమ హాస్టళ్లలో వసతులకు పెద్దపీట
- అంబేద్కర్ విగ్రహాన్ని ప్రారంభించిన మంత్రి స్వామి



అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి స్వామి, ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

మానవతావాది, ప్రపంచ మేధావి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ ముందు కెళ్లాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమం, వయో వృద్ధులు, వికలాంగులు, సచివాలయాలు, వాలంటీర్ల శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి తెలిపారు. ఒంగోలు ప్రకా శం భవనం ఆవరణలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ దళిత ఉద్యోగుల సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బిఆర్ అంబేద్కర్ కాంస్య విగ్రహాన్ని శుక్రవారం రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డిబివి స్వామి, ఒంగోలు, సంతనూతలపాడు ఎమ్మెల్యేలు దామచర్ల జనార్ధనరావు, బిఎన్ విజయకుమార్, ఒంగోలు మేయర్ గంగాడ సుజాతతో కలసి ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో మంత్రి డిబివి స్వామి మాట్లాడుతూ ప్రపంచ మేధావి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని కలెక్టరేట్‌లో ఆవిష్కరించడం సంతోషదాయక మన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సంక్షేమ వసతి గహాలలో, గురుకుల పాఠశాలల్లో అంబేద్కర్ విగ్రహాలను ఏర్పాటుచేయడంతో పాటు వచ్చే విద్యా సంవత్సరం నుండి వారి జీవిత చరిత్ర విద్యార్థులకు తెలిసేలా పుస్తకాలను పంపిణీ చేస్తామన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుండి సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందేలా సన్న బియాన్ని సరఫరా చేస్తామని మంత్రి తెలిపారు. ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసుల బాధితులకు దీర్ఘకాలికంగా పెండింగ్‌లోని నిధులు రూ.40 కోట్లు మంజూరు చేశామన్నారు. మరో 20 కోట్ల రూపాయలు బకాయిలు ఉన్నాయని, మే నాటికి పూర్తిగా నిధులు మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. ఒంగోలు ▶ 2లో

మద్దతు ధర లేక..

అన్నదాతల ఆవేదన

- తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేట్ మార్కెట్‌లోనే అమ్మకం
- రూ.1600 లోపే ధాన్యం కొంటున్న వ్యాపారులు
- రైతుల వద్ద ఇంకా 90 వేల మెట్రిక్ టన్నుల నిల్వలు



పొలాల్లో ఉన్న వరి కుప్పలు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

రైతులు పండించిన ధాన్యాన్ని చివరి గింజ వరకు కొంటామని కూటమి ప్రభుత్వ నేతలు హామీ ఇచ్చారు. కానీ రైతులు తాము పండించిన ధాన్యానికి మద్దతు ధర లేక ప్రైవేట్ వ్యాపారులకు తెగనమ్ముకుంటున్నారు. ధాన్యం కొనుగోలులో జిల్లాల మధ్య అంతరాలు ఉన్నట్లు వెల్లడవుతోంది. కొన్ని జిల్లాల్లో ధాన్యం దిగుబడి, మార్కెట్‌లోకి వచ్చే ధాన్యం లెక్కల అంచనాల ప్రకారం సగం పైగా ధాన్యాన్ని రైతు సేవా కేంద్రాల ద్వారా కొన్నారు. మరికొన్ని జిల్లాల్లో మొక్కుబడిగా ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. రైతులు పండించిన ధాన్యం మొత్తం కాకపోయినా సగం మేర కూడా కొంటున్న పరిస్థితి లేదు. ఉదాహరణకు.. శ్రీకాకుళం జిల్లాలో 9 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనాలు వేసి రైతుల అవసరాలు, తిండిగింజలు పోనూ 7 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మార్కెట్‌లోకి వస్తుందని అధికారులు అంచనా వేశారు. 4.90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు కొన్నారు. రైతుల నుంచి ఉన్న డిమాండ్ మేరకు మొత్తంగా 5.10 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు అక్కడ అనుమతులిచ్చారు.

తూర్పుగోదావరి జిల్లాలో 2.58 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం, ఏలూరు జిల్లాలో 3.50 లక్షల మెట్రిక్ టన్నులు, కాకినాడ జిల్లాలో 1.58 లక్షల మెట్రిక్ టన్నులు, విజయనగరం జిల్లాలో 3.33 లక్షల మెట్రిక్ టన్నులు, పశ్చిమ గోదావరి జిల్లాలో 4.17 లక్షల మెట్రిక్ టన్నులు, కోనసీమ జిల్లాలో 2.27 లక్షల మెట్రిక్ టన్నులు, కృష్ణా జిల్లాలో 5.68 లక్షల మెట్రిక్ టన్నులు, ఎన్‌టిఆర్ జిల్లాలో 1.11 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లు జరిపారు. వరి సాగు చేసే అన్ని జిల్లాల్లో సరాసరిన మార్కెట్‌లోకి వచ్చిన ధాన్యంలో సగం పైగా రైతు సేవా ▶ 2లో

విశాఖ ఉక్కును ప్రైవేటీకరించబోమని

కేంద్ర ప్రభుత్వం ప్రకటించాలి

- ప్రైవేటీకరణను రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకోవాలి
- విశాఖ ఉక్కుకు సొంత గనులు కేటాయించాలి
- వామపక్ష పార్టీలు, అఖిలపక్ష ట్రేడ్ యూనియన్స్ ఆధ్వర్యంలో నిరసన



సాగర్ హోటల్ సెంటర్ వద్ద నిరసన తెలుపుతున్న వామపక్షాలు, కార్మిక సంఘాల నాయకులు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని, ప్రైవేటీ కరణ రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకోవాలని, విశాఖ ఉక్కుకు సొంత గనులు కేటాయించాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు పోరాటానికి సంఘీభావంగా, కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్త పిలుపుమేరకు శుక్రవారం నాడు వామపక్ష పార్టీలు, అఖిలపక్ష ట్రేడ్ యూనియన్స్ ఆధ్వర్యంలో సాగర్ హోటల్ సెంటర్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు కాలం సుబ్బారావు, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మోసపూరిత వైఖరితో వ్యవహరిస్తోందన్నారు. ఒక పక్క ప్రైవేటీ కరించబోమని చెబుతూనే మరో పక్క ఉద్యోగాలు లేకుండా, వేతనాలు లేకుండా, ముడి సరుకు ఇవ్వకుండా చేయడం, ఇవన్నీ కూడా ప్రైవేటీకరణ దిశగా సాగుతున్నాయని దుయ్యబట్టారు. మిట్టల్‌కు గనులు కేటాయించేందుకు యోచించే రాష్ట్ర ప్రభుత్వం విశాఖ ఉక్కుకు క్యాప్టివ్ మైన్స్ కేటాయించాలని డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కును కాపాడుకునేందుకు రాష్ట్రవ్యాప్తంగా పోరాటం చేయడం తప్ప వేరే మార్గం లేదని తెలిపారు. సిపిఎం జిల్లా కార్యదర్శి షేక్ మాబు మాట్లాడుతూ ప్రకాశం జిల్లాకు చెందిన ఎంపీ మాదాల నారాయణ స్వామితో పాటు పలువురు శాసనసభ్యుల రాజీనామాలు, త్యాగాలతో విశాఖ ఉక్కును సాధించుకున్నామని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం కేటాయించిన రూ.15 వేల కోట్లు పెండింగ్ బకాయిలు తీర్చేసి ప్రైవేట్ సంస్థలకు కట్టబెట్టే ప్రక్రియలో భాగమేనని పేర్కొన్నారు. రూ.5 వేల కోట్ల పెట్టుబడితో ప్రభుత్వ పెట్టుబడితో రూ.60 వేల కోట్ల మొత్తంలో ప్రభుత్వానికి డివిడెంట్ రూపంలో చెల్లించి, రూ.మూడున్నర లక్షల కోట్ల సంపద కలిగి ఉన్న విశాఖ ఉక్కును అప్పనంగా ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టడం దుశ్చర్యగా పేర్కొన్నారు. మిట్టల్‌కు గనులు ఇస్తానన్న ముఖ్యమంత్రి చంద్రబాబు విశాఖ ఉక్కు గురించి నోరు విప్పకపోవడం విచారకరమన్నారు. ఏఐటియు న్యూ జిల్లా కార్యదర్శి ఎమ్మెస్ సాయి మాట్లాడుతూ విశాఖ ఉక్కు కోసం చేపట్టిన ఉద్యమం, ఉపాధి కోసం, భద్రత కోసం, విశాఖ పరిరక్షణ కోసం సాగుతున్న వైనాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఐఎఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్.మోహన్ మాట్లాడుతూ విశాఖ ఉక్కు వల్లే భారతదేశంలో ▶ 2లో



ఒంగోలులో రంగులు చల్లుకుంటూ యువకుల సందడి

హంగామా హోలీ

హోలీ పండుగను శుక్రవారం జిల్లావ్యాప్తంగా ఉత్సాహంగా నిర్వహించారు. ఒంగోలులో యువకులు, చిన్నారులు, పెద్దలు, మహిళలు వేడుకల్లో పాల్గొన్నారు. రంగులు చల్లుకుంటూ.. సందడి చేశారు. ప్రకాశం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలోనూ హోలీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎస్పీ దామోదర్ పోలీసు సిబ్బందిపై రంగులు చల్లుతూ.. పండుగ వాతావరణం తీసుకొచ్చారు.



పోలీసు సిబ్బందిపై రంగులు చల్లుతూ సందడి చేస్తున్న ఎస్పీ దామోదర్

మద్దతు ధర లేక.. అన్నదాతల ఆవేదన

(మొదటిపేజీ తరువాయి)

కేంద్రాల ద్వారా కొనుగోళ్లు చేశారు. కానీ బాపట్ల జిల్లా రైతులకు మాత్రం ఈ విషయంలో తీరని అన్యాయం జరిగింది. బాపట్ల జిల్లాలో ఖరీఫ్‌లో ఐదున్నర లక్షల మెట్రిక్ టన్నుల మేర ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. ఇతర జిల్లాలతో పోల్చి చూస్తే కనీసం రెండు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం అయినా ప్రభుత్వం కొనాల్సి ఉంది. కానీ జిల్లాలో 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు మాత్రమే అనుమతులు తీసుకున్నారు. రైతుల నుంచి వస్తున్న ఒత్తిడుల మేరకు పలు దఫాలుగా పెంచుతూ ఇప్పటి వరకు 89 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు చేశారు. రైతుల వద్ద ఇంకా 90 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వలు ఉన్నాయి. ఈ ధాన్యాన్ని ప్రభుత్వం కొనే పరిస్థితి కనిపించడం లేదు.

జిల్లాలో ధాన్యం మార్కెట్‌లోకి వస్తున్న తరుణంలో జిల్లాలోని వేమూరు నియోజకవర్గంలో పర్యటించిన రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ రైతులతో మాట్లాడారు. రైతులెవరూ ఆందోళన చెందవద్దని వరిసాగు చేసిన రైతుల నుంచి ప్రతి గింజనూ ప్రభుత్వం కొంటుందన్నారు. ధాన్యం అమ్మకాల విషయంలో రైతులు ఎవరూ తొందరపడకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా అమ్మకాలు జరపాలని చెప్పారు. రైతులు తమ ధాన్యం కొనాలని రైతు సేవాకేంద్రాల చుట్టూ తిరుగుతున్నారు. కానీ అక్కడ ధాన్యం కొంటున్న పరిస్థితి లేదు. అధికారులు గత ఏడాది ధాన్యం కొనుగోలు ప్రకారం ఈ ఖరీఫ్ కొనుగోళ్లు నిర్ణయించారు. ధాన్యం దిగుబడి, మార్కెట్ తీరును బట్టి రైతులకు తగిన మద్దతు ధర కోసం ఎంత ధాన్యం కొనాలి అనేది నిర్ణయించాల్సి ఉండగా వాస్తవ పరిస్థితులు ఇందుకు భిన్నంగా ఉన్నాయి.

రైతు సేవాకేంద్రాల ద్వారా 75 కిలోల కామన్ రకం ధాన్యంకు రూ.1,725, గ్రేడ్ 'ఏ' రకం ధాన్యంకు రూ.1,740 చొప్పున మద్దతు ధరతో కొన్నారు. కాగా గతేడాది ప్రైవేట్ వ్యాపారులు 75 కిలోల ధాన్యాన్ని రూ.1800కు కొన్నారు. అప్పట్లో ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర తక్కువగా ఉండటంతో రైతులు వారికే ధాన్యం అమ్మకాలు జరిపారు. కానీ ఈ ఏడాది మాత్రం ప్రైవేట్ వ్యాపారులు రూ.1400 నుంచి మొదలు పెట్టి రూ.1600 లోపు ధరపైనే ధాన్యం కొంటున్నారు.

ధాన్యంకు తగిన మార్కెట్ లేని కారణంగా ఈ ఏడాది ప్రారంభంలోనే తగిన ధర లేదని చెబుతూ వచ్చారు. ప్రైవేట్ మార్కెట్ కంటే ప్రభుత్వమే ఎక్కువ ధర ఇస్తున్న క్రమంలో రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం అమ్మకాలు జరిపేందుకు రైతులు సిద్ధపడ్డారు. కానీ ప్రభుత్వం రైతుల డిమాండ్ మేరకు ధాన్యం కొనుగోలుకు ముందుకు రాకపోవడంతో రైతులు నష్టపోతున్నారు. జిల్లాలో ఖరీఫ్‌లో సాగు చేసిన ధాన్యం కుప్పలు పొలాల్లోనే ఉన్నాయి. వరి కుప్పలు వేసిన రైతులు రెండో పంటగా మినుము, పెసరలు సాగు చేశారు. ఈ పంట కోత అయ్యాక ధాన్యం కుప్పలు నూర్చుతారు. అయితే ధాన్యానికి తగిన మార్కెట్ లేకపోవడంతో ప్రభుత్వమే రైతు సేవాకేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

విశాఖ ఉక్కును ప్రైవేటీకరించబోమని కేంద్ర ప్రభుత్వం ప్రకటించాలి

(మొదటిపేజీ తరువాయి)

గాజువాక నియోజకవర్గంలో అత్యధిక జీడీపీగా నమోదైన అంశాన్ని గుర్తు చేశారు. రూ.2.32 లక్షలు జిడిపి నమోదు వెనుక విశాఖ ఉక్కు దాగుందని పేర్కొన్నారు. రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వీరారెడ్డి, సిపిఎం నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు తదితరులు మాట్లాడారు. కార్యక్రమానికి సిఐటియు జిల్లా కార్యదర్శి గంటెనపల్లి శ్రీనివాసులు, సిఐటియు ఒంగోలు నగర అధ్యక్ష కార్యదర్శులు సిహెచ్ రాంబాబు, టి.మహేష్, ఎఐటియుసి నాయకులు సర్దార్, శ్రీరామ శ్రీనివాసరావు, సిపిఎం నాయకులు జి.రమేష్, కె.రమాదేవి, బాలకోటయ్య, శ్రీనివాసరావు, మున్నాబాషా, సలార్, కె.లలితకుమారి, రాజశేఖర్, ఆర్.వెంకటరావు కార్యక్రమానికి నాయకత్వం వహించారు.

నేడు టిడిపి కొండపి నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం

ప్రజాశక్తి-పొన్నలూరు

ఐఓసీఎల్ ఎదురుగా ఉన్న దామచర్ల సత్య కార్యాలయంలో శనివారం సాయంత్రం 3 గంటల సమయంలో కొండేపి నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం జరగనుంది. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మారీటైం బోర్డు చైర్మన్, దామచర్ల సత్య ముఖ్య అతిథులుగా విచ్చేయనున్నారు. పొన్నలూరు మండలంలోని అన్ని గ్రామాల తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, బూత్, యూనిట్, క్లస్టర్ ఇన్‌ఛార్జులు తప్పక ఈ కార్యక్రమంలో పాల్గొనాలని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు అనుమోలు సాంబశివరావు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు.

ఘడియపూడిలో సమస్యల వెల్లువ

సిపిఎం బృందం దృష్టికి తెచ్చిన ప్రజలు

ప్రజాశక్తి-మద్దిపాడు



సమస్యలను వింటున్న సిపిఎం నాయకులు

ప్రజా చైతన్య యాత్రలో భాగంగా మండల పరిధిలోని ఘడియాపూడి కాలనీలో సిపిఎం నాయకులు ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ కాలనీలో వీధిలైట్లు లేవని, అంధకారంలో ఉన్నామని అన్నారు. చీకట్లో పెద్దవాళ్లు, పిల్లలు అనేక ఇబ్బందులకు గురవుతున్నామని చెప్పారు. అలాగే డ్రైనేజీ సమస్య ఉందని, మంచినీళ్లు సక్రంగా రావటం లేదని, శ్మశాన సమస్య ఉందని ప్రజలు వాపోయారు. ఈ సమస్యలన్నీ ప్రభుత్వం పరిష్కరించాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బి రఘురాం, మండల కార్యదర్శి ఉబ్బా ఆదిలక్ష్మి, వెంకటేశ్వర్లు, కనపర్తి సుబ్బారావు, కాకుమాను సుబ్బారావు, ఎస్‌కె కాసిం పాల్గొన్నారు.



బాలుడికి అన్నప్రాసన చేయిస్తున్న మాజీ మంత్రి సురేష్

అన్నప్రాసన వేడుకలో మాజీ మంత్రి సురేష్

ప్రజాశక్తి-మద్దిపాడు: జార్జి ఇంజనీరింగ్ కళాశాల స్టాఫ్ అనిల్ కుమారుడు అన్నప్రాసన వేడుకకు మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ హాజరయ్యారు. శుక్రవారం మండల కేంద్రమైన మద్దిపాడులో నిర్వహించిన వేడుకకు ముఖ్యఅతిథిగా హాజరై చిన్నారికి అన్నప్రాసన చేయించారు. మాజీ మంత్రి వెంట వైసీపీ నాయకులు సంజీవరావు, అశోక్‌రెడ్డి, వినోద్‌కుమార్, శశికుమార్, ఆచారి, యాకోబు, మసీద్, పలువురు వైసిపి నాయకులు ఉన్నారు.

ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో జకాత్ కిట్ల పంపిణీ

ప్రజాశక్తి-కంభం రూరల్



జకాత్ కిట్లతో ఆవాజ్ నాయకులు

కంభం మండల ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో రంజాన్ పర్వదినం సందర్భంగా శుక్రవారం 20 మంది పేదలకు నిత్యావసర వస్తువులతో కూడిన జకాత్ కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆవాజ్ కమిటీ జిల్లా కార్యదర్శి షంషేర్ బేగ్, మండల ఆవాజ్ కమిటీ నాయకులు ఎం రసూల్ బేగ్, సయ్యద్ జలీల్, షేక్ షఫీ తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ స్ఫూర్తితో ముందుకు..

(మొదటిపేజీ తరువాయి)

శాసన సభ్యులు దామచర్ల జనార్ధన రావు మాట్లాడుతూ మహనీయులు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని కలెక్టరేట్‌లో ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. లిడ్ క్యాప్ చైర్మన్ మాణిక్య రావు, ఒంగోలు మేయర్ గంగాడ సుజాత ప్రసంగించారు. కార్యక్రమంలో జరుగుమల్లి మండల ఎంఇఒ బత్తుల నాగేంద్రవదన్, పల్నాడు జిల్లా డిఆర్ఓ మురళి, సోషల్ వెల్ఫేర్ డిడి లక్ష్మా నాయక్, ఎస్.సి కార్పొరేషన్ ఈడీ అర్జున్ నాయక్, ఆర్ఐఓ ఎ.సైమన్ విక్టర్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ప్రకాశం జిల్లా అధ్యక్షులు సిహెచ్ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎన్జీవో అసోసియేషన్ ప్రకాశం జిల్లా అధ్యక్షులు కూచిపూడి శరత్ బాబు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ దళిత ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యకులు ఈదర విజయ భాను, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. సునీల్ కుమార్, ప్రకాశం జిల్లా అధ్యక్షులు జూపల్లి రాజు, దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు నీలం నాగేంద్రరావు, మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షులు బిళ్ళా చెన్నయ్య, డిసిసి అధికార ప్రతినిధి మన్నం ప్రసన్నరాజు, వివిధ దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ప్రజాభిప్రాయ సేకరణ లేకుండానే

ఇసుక తరలింపు

కాలుష్య నియంత్రణ మండలి ఆదేశాలు బేఖాతరు

ఆందోళన వ్యక్తం చేస్తున్న లంక గ్రామాల ప్రజలు

ప్రజాశక్తి-వేమూరు

ఇసుక తరలింపునకు కేటాయించిన ప్రాంతంలోని గ్రామాలలో ప్రజల అభిప్రాయాలను సేకరించిన అనంతరం మాత్రమే ఇసుక తవ్వకాలు చేపట్టాలని భూగర్భ గనుల శాఖ ఇచ్చిన ఆదేశాలను బేఖాతరు చేస్తూ అక్రమ ఇసుక తరలింపు కొనసాగుతోంది. ఫిబ్రవరి 11వ తేదీన బాపట్ల, గుంటూరు, కృష్ణా జిల్లాల నదీ పరివాహక గ్రామాలలో ఇసుక తరలింపునకు ముందుగా ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టాలని కోరుతూ కాలుష్య నియంత్రణ మండలి ఆదేశాలు జారీ చేసింది. ఈ ఆదేశానుసారం బాపట్ల జిల్లా పరిధిలోని గాజులంక, చిలుమూరు లంక, చింతలంక, పెదలంక, సుగ్గుణాలంక వంటి గ్రామాలతో పాటు గుంటూరు జిల్లా పరిధిలో కొల్లిపర్ర, అన్నవరం, అన్నవరపు లంక మరియు కృష్ణా జిల్లా పరిధిలోని పమిడిముక్కల మండలం మరియు ఘంటసాల మండల పరిధిలోని నదీ పరివాహక గ్రామాలలో గ్రామపంచాయతీ అధికారులు గ్రామసభలు నిర్వహించి ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టి తద్వారా అభిప్రాయాల్లో వెలుగు చూసిన అంశాల ప్రకారం ఇసుక తరలింపుకు అనుమతులు ఇవ్వాల్సి ఉంది. ఆ మేరకు అన్ని గ్రామ పంచాయతీలకు, మండల తహశీల్దార్ కార్యాలయాలకు, విజయవాడ కాలుష్య నియంత్రణ మండలి నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. కానీ ఏ ఒక్క గ్రామంలో కూడా ఎలాంటి గ్రామసభలు నిర్వహించకుండానే, ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టకుండానే ఇసుకను తరలిస్తున్నారు.

గ్రామాలకు పొంచి ఉన్న ముప్పు

కొల్లూరు మండలం పరిధిలోని చింతలంక, పెదలంక, సుగ్గుణాలంక, ఈపూరలంక, చిలుమూరులంక, గాజులలంక మరియు అన్నవరపు లంక కొత్తూరు లంక వంటి గ్రామాలు ఇసుక తరలింపు కారణంగా కోతకు గురై పర్యావరణ ప్రమాదానికి గురయ్యే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఇసుక తరలింపు కారణంగా భూగర్భ జలాలు ఉప్పునీరుగా మారి సరైన దిగుబడి రాక రైతులు అవస్థలు పడుతున్నారు. భవిష్యత్తులో గ్రామాలు కూడా కనిపించకుండా పోయే ప్రమాదం పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాలను ఆనుకొని 15 ఎకరాలలో ఇసుకను తరలించడం వలన వరదల సమయంలో గ్రామాలు కోతకు గురై పంట భూములతో పాటు గృహాలు కూడా నదీ గర్భంలో కలిసిపోయే అవకాశం ఉందని, ఈ విషయాన్ని పలుమార్లు జిల్లా రాష్ట్రస్థాయి అధికారులకు విన్నవించినా ఎలాంటి చర్యలు కనిపించడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా ఆయా గ్రామపంచాయతీలో గ్రామ సభలు నిర్వహించి ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టాలని ఇచ్చిన ఆదేశాలు రాజకీయ నాయకుల ఒత్తిడి కారణంగా బుట్ట దాఖలు అయ్యాయని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు చొరవ చూపి ఇసుక తరలింపు వలన జరిగే నష్టాలపై దృష్టి సారించి తగిన చర్యలు చేపట్టాలని నదీ పరీవాహక ప్రాంతంలోని లంక గ్రామాల వాసులు కోరుతున్నారు.



కృష్ణానదిలో ఇసుక తరలిస్తున్న లారీలు

ట్రాక్టర్, బైక్ ఢీ.. ఒకరికి గాయాలు

ప్రజాశక్తి-కొండపి

కట్టెల ట్రాక్టర్, బైక్ ఢీకొన్న ఘటనలో ఒకరు గాయపడ్డారు. ఈ సంఘటన మండలంలోని కొండపి నుంచి పొదిలి వెళ్లే రోడ్డులోని స్థానిక బ్రిక్స్ వద్ద గురువారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల తెలిపిన వివరాల ప్రకారంజజ కొండపిలోని బీసీ కాలనీలో నివాసముంటున్న షేక్ మస్తాన్ వలి కొండపి నుంచి బీసీ కాలనీ వైపు వెళ్తుండగా, ఎదురుగా వస్తున్న కట్టెల ట్రాక్టర్ ఢీకొని తలకు గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే 108కి సమాచారం అందించి, కొండపి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ప్రైవేట్ వాహనంలో ఒంగోలులోని ఒక ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు.



మాణిక్యవేల్‌కు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

మాణిక్యవేల్‌కు ఎమ్మెల్యే నివాళి

ప్రజాశక్తి-వేమూరు

ట్రిపుల్ ఎక్స్ సోప్ అధినేత డాక్టర్ అరుణాచలం మాణిక్యవేల్ (అన్నాజ్)కు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు నివాళి అర్పించారు. ఈయన గత కొన్నేళ్లుగా గుంటూరులో నివాసం ఉంటూ స్థిరపడ్డారు. ట్రిబుల్ ఎక్స్ సోప్‌తో పాటు ఆయన అనేక రకాల సేవా కార్యక్రమాలు చేపట్టి మంచి గుర్తింపును పొందారు. ఈయన మృతి సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు శుక్రవారం గుంటూరులో మాణిక్యవేల్ పార్థివదేహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. కుటుంబానికి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

ప్రజాశక్తి-వేటపాలెం

మండల పరిధిలోని పలు ప్రాంతాలలో ఎక్సైజ్ శాఖ అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించారు. స్థానిక బస్‌స్టాండ్ సెంటర్ వద్ద ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకొని అతని వద్ద నుంచి 11 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ చట్ట ప్రకారం పద్యం బాటిళ్లు కలిగి ఉండటం, రవాణా చేయటం, అమ్మడం నేరమని ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ పి.నాగేశ్వరావు అన్నారు.

అదృశ్యమైన బాలిక మార్టూరులో ప్రత్యక్షం

బస్సులో వెళుతుండగా గుర్తించిన ప్రయాణికులు

తల్లిదండ్రులకు అప్పగించిన సీఐ శేషగిరిరావు

ప్రజాశక్తి-మార్టూరు రూరల్

ఆర్టీసీ బస్సులో అనుమానాస్పదంగా ఒంటరిగా ప్రయాణిస్తున్న బాలికను ప్రయాణికులు గుర్తించి మార్టూరు పోలీస్ స్టేషన్‌లో అప్పగించడంతో సీఐ మాదినేని శేషగిరిరావు బాలిక నుండి వివరాలు రాబట్టి వారి తల్లి తండ్రులకు అప్పగించిన ఘటన శుక్రవారం మార్టూరులో చోటుచేసుకుంది. అందిన వివరాల ప్రకారం.. పల్నాడు జిల్లా ఎడ్లపాడు మండలం బోయపాలెం గ్రామానికి చెందిన భూక్యా శంకర్ నాయక్ కుమార్తె చిలకలూరిపేట పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో 5వ తరగతి చదువుతుంది. ఈ క్రమంలో హోలీ పండగ రోజున ఉదయం నుంచి బాలిక ఇంటి నుండి కనిపించకుండా పోయింది. కంగారు పడిన తల్లితండ్రులు ఎడ్లపాడు ఎస్ఐ బాలకృష్ణకు ఫిర్యాదు చేశారు. అయన వెంటనే చిలకలూరిపేట రూరల్ ఎస్ఐ సుబ్బారాయుడు, మార్టూరు సర్కిల్ ఇన్స్పెక్టర్‌కి సమాచారం ఇచ్చి బాలిక కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో ఒంగోలు వైపు వెళుతున్న ఆర్టీసీ బస్సులో ఓ బాలిక అనుమానాస్పదంగా ప్రయాణించడాన్ని ప్రయాణికులు గుర్తించి బాలికను ప్రశ్నించగా పొంతన లేని సమాదానాలు చూపుతుండటంతో బస్సుని మార్టూరు పోలీస్ స్టేషన్ వద్ద నిలిపి అక్కడి పోలీసులకు బాలికను అప్పగించారు. అప్పటికే సీఐకి బాలిక మిస్సింగ్ గురించి సమాచారం అందడంతో విషయాన్ని ఎడ్లపాడు, చిలకలూరిపేట ఎస్ఐలకు సమాచారం అందించడంతో అక్కడి పోలీస్ సిబ్బంది మార్టూరు వచ్చి బాలికను ఎడ్లపాడులో తండ్రి శంకర్ నాయకికి అప్పగించారు. బాలిక అదృశ్యమైన కొద్ది గంటల వ్యవధిలోనే మార్టూరు వద్ద సీఐ మాదినేని శేషగిరిరావు తల్లితండ్రులకు అప్పగించడంపై సర్వత్రా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి-భట్టిప్రోలు

పలువురికి సీఎంఆర్ ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పంపిణీ చేశారు. ఆల్లమూడి గ్రామానికి చెందిన పులి జగదీష్‌కి రూ.1.54,568, భట్టిప్రోలు గ్రామానికి చెందిన సిరాందాసు హేమామాలినికి రూ.50,564, చింతమోటు గ్రామానికి చెందిన ఉయ్యూరు అక్షయకు రూ.49,983, పెదాపులివర్రు గ్రామానికి చెందిన మల్లిపెద్ది నాగవర్ధినికి రూ.32,324, సూరేపల్లి గ్రామానికి చెందిన వేపూరి శైలజకు రూ.23,920 చెక్కులను బాధితులకు ఎమ్మెల్యే తన క్యాంపు కార్యాలయంలో అందజేశారు.



లబ్ధిదారులకు చెక్కులు అందిస్తున్న నరేంద్ర వర్మ

బాపట్ల: బాపట్లలోని టీడీపీ కార్యాలయంలో లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి వచ్చిన చెక్కులను ఎమ్మెల్యే నరేంద్ర వర్మ అందజేశారు. బాపట్ల పట్టణం దగ్గుమల్లివారి పాలెంకి చెందిన దాసరి మురళికి రూ.1,01,707, రైలుపేటకు చెందిన షేక్ మస్తాన్ వలికి రూ.74,398, ఇమ్మడిశెట్టివారిపాలెంకి చెందిన ఇమ్మడిశెట్టి మురళీకృష్ణకు రూ.56,365, చిల్లర గొల్లపాలెంకి చెందిన ఆవుల వెంకటేశ్వర్లుకు రూ.45 వేలు, పట్టణానికి చెందిన అన్నవరం మాధవరావుకు రూ.42,000, జి.హరి ప్రకాష్‌కు రూ.18,000 విలువైన చెక్కులను బాధితులకు ఎమ్మెల్యే నరేంద్ర వర్మ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఒక వరం అన్నారు. పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షులు గొలపల శ్రీనివాసరావు, మందపాటి ఆంధ్రేయ, తెలుగుదేశం, జనసేన, నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను పేదలకు పంచాలి

తహసీల్దార్‌కు దళిత నేత కిరణ్ వినతి

ప్రజాశక్తి-చీరాల

చీరాల మున్సిపల్ పరిధిలోని 31వ వార్డు రోశయ్య కాలనీ సెయింట్ ఆన్స్ పాఠశాల సమీపంలోని ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురవుతున్నాయని ఆ భూములను పారదర్శకంగా సర్వే చేసి అర్హులైన పేదలకు కేటాయించాలని దళిత నేత కొండ్రు కిరణ్ అన్నారు. శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఆయన మీడియతో మాట్లాడారు. ప్రభుత్వ భూములు ఆక్రమణల పేరిట సోషల్ మీడియా వేదికగా తనపై కొందరు ఉద్దేశపూర్వకంగా ఆరోపణలు చేయటాన్ని కిరణ్ తీవ్రంగా ఖండించారు. ఈ క్రమంలోనే తనపై చేస్తున్న ప్రచారం నేపథ్యంలో తహశీల్దార్ గోపికృష్ణను కలిసి వినతిపత్రం అందజేశారు. రోశయ్య కాలనీలో స్థానికంగా తనకు ప్రభుత్వ నిబంధనలకు లోబడి తనకు సర్వహక్కులు కలిగిన భూములలో సైతం సర్వే చేయించాలని కోరారు. తాను ఏ మాత్రం ప్రభుత్వ భూమిని ఆక్రమించి ఉంటే ఆయా భూములను బేషరతుగా స్వాధీనం చేసుకోవచ్చునన్నారు. అందుకు తాను ప్రభుత్వ అధికారులకు అన్ని విధాలా సహకరిస్తామన్నారు. ఇదే క్రమంలో రోశయ్య కాలనీలో పెద్ద ఎత్తున ప్రభుత్వ భూములు ఆక్రమణల చెరలో ఉన్నాయన్నారు. ఆయా భూములలో అధికారులు పారదర్శకంగా సర్వే చేసి ప్రభుత్వ భూములను సంరక్షించాలని కోరేరు. ఫిర్యాదు స్వీకరించిన తహశీల్దార్ గోపికృష్ణ వెంటనే సర్వే చేయాలని సర్వేయర్‌ను ఆదేశించారు.



తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న కిరణ్

రాయితీలను సద్వినియోగం చేసుకోవాలి

కెవిఐసి అసిస్టెంట్ డైరెక్టర్ కోటిరెడ్డి

ప్రజాశక్తి- చీరాల

యువ పారిశ్రామికవేత్తలకు భారత ప్రభుత్వం ఎంఎస్ఎంఈల ద్వారా వివిధ పథకాలకు రాయితీలు కల్పిస్తోందని, ఈ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కెవిఐసి అసిస్టెంట్ డైరెక్టర్ కోటిరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో డీఆర్‌డీఏ ఏపీఎం మధుసూదన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన హాజరై మాట్లాడారు. యువ పారిశ్రామికవేత్తలు వారి ఆలోచనలతో నూతన పరిశ్రమలు స్థాపించి ఎంతోమందికి ఉపాధి కల్పించవచ్చన్నారు. అందుకు సంబంధించి రాయితీలను ప్రభుత్వం అందిస్తుందన్నారు. కెవిఐసి డైరెక్టర్ డాక్టర్ ఎస్.గ్రీస్, డిఐసి రామకృష్ణ, బీసీ కార్పొరేషన్ ఎఇఒ చిట్టిబాబు, డిఆర్డిఏ డిపిఎం లక్ష్మణచారి, డిఆర్డిఏ ఏపీఎం అంజిబాబు, డిఐసి ఏడి వాణి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కెవిఐసి అసిస్టెంట్ డైరెక్టర్ కోటిరెడ్డి

నేడు ఖోఖో జట్ల ఎంపిక

ప్రజాశక్తి - పంగులూరు

ఒరిస్సాలో జరుగనున్న 57వ సీనియర్ జాతీయ స్థాయి స్త్రీ, పురుషుల ఖోఖో పోటీలకు ఆంధ్ర ప్రదేశ్ స్త్రీ, పురుషుల జట్ల ఎంపిక పంగులూరులోని మాగుంట సుబ్బరామిరెడ్డి మరియు బాచిన నారాయణమ్మ జూనియర్ కళాశాలలోని ఎస్ఆర్ఆర్ ఖోఖో అకాడమీలో ఈ నెల 15వ తేదీ శనివారం జరుగుతుందని రాష్ట్ర ఖోఖో కార్యదర్శి మేకల సీతారామరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎంపికలు ఉదయం 9 గంటల నుంచి ప్రారంభమవుతాయని ఆయన అన్నారు. ఈ జట్ల ఎంపికకు రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాల నుంచి 100 మంది పురుషులు, వందమంది స్త్రీలు పాల్గొంటారని, కోచ్‌లు, మేనేజర్లు, వివిధ జిల్లాల కార్యదర్శిలు పాల్గొని జట్లను ఎంపిక చేస్తారని తెలిపారు. ఈ ఎంపిక ఈనెల15 వ తేదీ నుంచి 16వ తేదీ వరకు జరుగుతుందని సీతారాం రెడ్డి తెలిపారు. ఎంపికైన స్త్రీ, పురుషుల జట్లు ఈనెల 31వ తేదీ నుంచి ఒరిస్సాలో జరిగే ఖోఖో పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఎంపికైన జట్లకు పంగులూరులో క్యాంపు నిర్వహిస్తామన్నారు. శాప్ అబ్జర్వర్, మరియు జిల్లా కార్యదర్శి బి.కాశీ విశ్వనాథ రెడ్డి, అధ్యక్షులు కుర్రా భాస్కరరావు, కోశాధికారి హనుమంతరావు, ఉమ్మడి ప్రకాశం జిల్లా టెక్నికల్ అఫీషియల్స్ పాల్గొంటారని సీతారాం రెడ్డి చెప్పారు.

స్టీల్ ప్లాంట్ నిధులు

కార్మికుల జీతాలకు చెల్లించాలి

సిఐటియు జిల్లా కార్యదర్శి మజుందార్



నిరసన తెలుపుతున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి-బాపట్ల

విశాఖ స్టీల్ ప్లాంట్ నిధులు కార్మికుల జీతాలకు కేటాయించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి సిహెచ్ మజుందార్ డిమాండ్ చేశారు. శుక్రవారం సిఐటియు, సిపిఎం ఆధ్వర్యంలో బాపట్ల పాత బస్టాండ్ సెంటర్లో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మజుందార్ మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిలిపివేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం విశాఖ స్టీల్ ప్లాంట్‌కు కేటాయించిన ప్యాకేజీ రూ.11,443 కోట్లు కేవలం అప్పులు తీర్చుకోవడానికి ఇవ్వడాన్ని సిఐటియు, సిపిఎం నాయకులు ఖండించారు. కేంద్ర ప్రభుత్వం ప్యాకేజీ కేవలం విశాఖ స్టీల్ ప్లాంట్ అమ్మాలని ప్రయత్నం అప్పులు తీర్చడానికి తప్ప, స్టీల్ ప్లాంట్ గాని కార్మికులకు గాని ఈ ప్యాకేజీతో ఉపయోగం లేదన్నారు. కేవలం అప్పులు తీర్చుకోవడానికే ప్యాకేజీ ఇస్తున్నామని కేంద్ర మంత్రులు ప్రకటించడం కార్మిక వ్యతిరేక చర్య అన్నారు. దేశంలో స్టీల్ ప్లాంట్ ప్రారంభానికి ముందే అనేక సంస్థలకు కేంద్ర ప్రభుత్వం గనులు కేటాయిస్తుందని ఒరిస్సాలో మిట్టల్‌కు, గాలి జనార్దన్ రెడ్డి లాంటి వారికి ముందుగానే గనులు కేటాయించి వేల కోట్ల రూపాయల ఇనుప ఖనిజం అమ్ముకున్న పరిస్థితి ఉందన్నారు. గత నాలుగు నెలలు నుండి కార్మికులకు సరిగా జీతాలు ఇవ్వకుండా, విఆర్ఎస్ పేరుతో కార్మికులను తగ్గించే ప్రయత్నం చేయటం, కార్మిక సమస్యలు ప్రశ్నించిన నాయకులకు షోకాజు నోటీసులు ఇచ్చి కార్మికులను ఇబ్బందులకుగురి చేసే చర్యల్లో భాగమేనని విమర్శించారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కాపాడుకునే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య మాట్లాడుతూ విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అని అనేకమంది త్యాగ ఫలితంగా విశాఖ ఉక్కు సాధించడం జరిగిందన్నారు. నేడు ప్రభుత్వాలు విశాఖ ఉక్కును అమ్మడం కోసం ప్రయత్నం చేస్తుందని దీనికి రాష్ట్ర ప్రజానీకం పెద్ద ఎత్తున నిరసించాలని విశాఖ స్టీల్ ప్లాంట్ వ్యతిరేక పోరాటంలో ప్రజలు, రాజకీయ పార్టీలు భాగస్వామ్యం కావాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు కె.కొండయ్య, కెవిపిఎస్ నాయకులు కే శరత్, కే. నాగేశ్వరరావు ,సిఐటియు నాయకులు బుచ్చిరాజు, భాష, బీఎస్పీ నాయకులు రాజారావు పాల్గొన్నారు.

ఘనంగా జనసేన ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశకి-పర్చూరు

మండల కేంద్రమైన పర్చూరులోని బొమ్మల సెంటర్లో జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శుక్రవారం జనసేన పార్టీ నాయకులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొని బొమ్మలు సెంటర్లో ఏర్పాటు చేసిన జనసేన పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన కేకును కట్ చేసి నాయకులకు, కార్యకర్తలకు పంచిపెట్టారు. వంగవీటి మోహనరంగా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కార్యకర్తలు పవన్ కళ్యాణ్, చంద్రబాబు నాయుడు, ఎమ్మెల్యే ఏలూరి నాయకత్వం వర్థిల్లాలి అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో తేజ, షంషుద్దీన్, కటారి సురేంద్ర, రంగశెట్టి ఆంజనేయులు, మారుతి, అబ్రహం, మార్కు, తులసి అప్పారావు, డి.సాంబయ్య, శ్రీనివాసరావు, మణికంఠ, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఛార్జీల పెంపుతో అవస్థలు

ప్రజాచైతన్యయాత్రలో వెల్లడించిన ప్రజలు


స్థానికులతో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రమాదేవి

ప్రజాశక్తి-చీరాల

పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి బి.రమాదేవి డిమాండ్ చేశారు. సిపిఎం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రజా చైతన్యయాత్రలో భాగంగా శుక్రవారం చీరాల పట్టణం 27 వార్డు జయశంకర్ నగర్‌లో ఇంటింటి సర్వేలో ఆమె పాల్గొని ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒకవైపు అద్దెలు భారంతో ఇబ్బంది పడుతున్న ప్రజలపై మరోవైపు ప్రభుత్వం అడ్డగోలుగా విద్యుత్ చార్జీలు పెంచి వసూలు చేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు అన్నారు. పేదలకు 2 సెంట్లు ఇళ్ల స్థలం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం చీరాల ప్రాంతీయ కార్యదర్శి ఎన్.బాబురావు, కమిటీ నాయకులు ఎమ్.వసంతరావు, ఎల్.జయ రాజు, బి.సుబ్బారావు పాల్గొన్నారు.

బాపట్ల: ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు, ఐపీఎస్ వంటి ఉన్నత ఉద్యోగాలు చేసి విశ్రాంత అధికారులుగా ఉన్న బాపట్ల మండలంలోని నరసాయపాలెం గ్రామంలో తాగునీరు లేక ప్రజలు అల్లాడుతున్నారు. శుక్రవారం సిపిఎం నేతలు గ్రామంలో నిర్వహించిన ప్రజా చైతన్య యాత్రలో అనేక సమస్యలను ప్రజలు పార్టీ నాయకుల దృష్టికి తెచ్చారు. జిల్లా కేంద్రమైన బాపట్లకు ఎనిమిది కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ గ్రామం నుంచి ఐఎఎస్, ఐపీఎస్ అధికారులుగా అధికారం చెలాయించిన విశ్రాంత ఉద్యోగులు ఉన్నారు. 40 ఏళ్ల క్రితం నిరుపేదలకు నివేశన స్థలాలు ఇచ్చిన తన్నీరు సీతారామ కాలనీకి కనీస సౌకర్యాలు లేక ఎక్కడ వేసిన గొంగళి ఎక్కడ చందంగానే ఉంది. 500 ప్లాట్లులో గృహాలు నిర్మించుకునేందుకు రోడ్డు లేదు. కనీస సౌకర్యాలు లేక రెండు ఇళ్ళు కట్టుకోలేక వదిలేశానని బత్తుల ఏకాకు చెప్పారు. ఊళ్ళో మంచినీటి చెరువు కావాలని ఎంతోకాలంగా ప్రజలు వేడుకుంటున్నా చెరువు అవసరాన్ని ప్రభుత్వం గుర్తించినప్పటికీ మోక్షం కలగలేదని గ్రామస్తులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారని సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య తెలిపారు. గ్రామంలో బాలికల వసతిగృహంలో సౌకర్యాలు కల్పించాలన్నారు. తన్నీరు సీతారామ కాలనీలో కనీస వసతులు లేకపోవడంతో ఇల్లు కట్టుకోలేని పరిస్థితి నెలకొని ఉంది. వర్షం కురిస్తే మోకాళ్ళ లోతు బురదతో వారం పది రోజులు వారు పడే ఇబ్బందులు వర్ణనాతీతం. ఈ కాలనీలో రోడ్లు , మంచినీటి పైపులు వేయాలని గంగయ్య డిమాండ్ చేశారు. గ్రామంలో హైస్కూల్ పునరుద్ధరించాలని ప్రజా చైతన్య యాత్రలో భాగంగా గ్రామంలో ఎస్సీ కాలనీవాసులు తమ బాధలను నాయకుల ముందు ఏకరువు పెట్టారు. ప్రజా చైతన్య యాత్రలో కొండయ్య, శరత్, కె.నాగేశ్వర రావు పాల్గొన్నారు.

రేపల్లె: జగనన్న కాలనీలో సమస్యలు పరిష్కరించాలని ప్రజలు సిపిఎం నేతల దృష్టికి తీసుకొచ్చారు. శుక్రవారం రేపల్లె పట్టణంలో సిపిఎం ప్రజా చైతన్యయాత్రలో భాగంగా స్థానిక సమస్యలు తెలుసుకోవడానికి జగనన్న కాలనీలో సీపీఎం నేతలు పర్యటించారు. ఈ సందర్భంగా సీపీఎం రేపల్లె పట్టణ కార్యదర్శి సిహెచ్ మనిలాల్ మాట్లాడుతూ కాలనీలో రోడ్లు, డ్రైనేజీ, వీధిలైట్లు, వంటి సమస్యలు వెంటనే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం నేతలు కే.ఆశీర్వాదం, కే.రమేష్, బి.అగస్టిన్, డి.శ్రీనివాసరావు, నాంచారమ్మ, పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

భట్టిప్రోలు: ప్రజా సమస్యల పరిష్కారానికి సిపిఎం చేపట్టిన ప్రజా చైతన్య యాత్రలను జయప్రదం చేయాలని సిపిఎం బాపట్ల జిల్లా కార్యవర్గ సభ్యులు టి.కృష్ణమోహన్ విజ్ఞప్తి చేశారు. స్థానిక ప్రజా సంఘాల కార్యాలయం లో సీపీఎం మండల కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా టి.కృష్ణమోహన్ మాట్లాడుతూ ఎన్ని ప్రభుత్వాలు మారినా కానీ ప్రజా సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదన్నారు. దీనికి గాను సిపిఎం రాష్ట్ర కమిటీ ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజా చైతన్య యాత్ర నిర్వహిస్తుందన్నారు. అందులో భాగంగా సిపిఎం బృందం మీ ప్రాంతంలో పర్యటిస్తుందని వీధి, వీధి తిరిగి సమస్యలు అధ్యయనం చేస్తుందన్నారు. ప్రజాచైతన్య యాత్ర బృందం దృష్టికి ప్రజలు చెప్పిన సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి ప్రజలతో కలిసి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ సమావేశంలో సిపిఎం పట్టిప్రోలు మండల కార్యదర్శి జి.సుధాకర్, కమిటీ సభ్యులు మురుగుడు సత్యనారాయణ, పి.మనోజ్ కుమార్, దీపాల సత్యనారాయణ పాల్గొన్నారు.


నరసాయపాలెంలో సమస్యలు తెలుసుకుంటున్న నేతలు



రేపల్లెలో పర్యటిస్తున్న సీపీఎం నాయకులు

ఘనంగా శింగరకొండ తిరునాళ్ల

- భారీగా స్వామిని దర్శించుకున్న భక్తులు
- విద్యుత్ ప్రభలపై సాంస్కృతిక కార్యక్రమాలు


ప్రత్యేక అలంకరణలో ప్రసన్నాంజనేయ స్వామి


విద్యుత్ దీపాల వెలుగుల్లో ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం

ప్రజాశక్తి-అద్దంకి

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం సింగరకొండ శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి వారి 70వ వార్షిక తిరునాళ్ల శుక్రవారం ఘనంగా నిర్వహించారు. భక్తులకు స్వామివారి దర్శనంతో పాటుగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తగు జాగ్రత్తలు తీసుకున్నారు. భక్తులకు తాగునీరు, మజ్జిగ, పిల్లలకు పాలు, ప్రసాదాలు పంపిణీ చేశారు. ప్రసన్నాంజనేయ స్వామి వారి దర్శనం కోసం భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. దేవస్థానం సహాయ కమిషనర్ మరియు కార్యనిర్వాహణాధికారి మదమంచి తిమ్మనాయుడు, శ్రీశైలం దేవస్థానం డిప్యూటీ కమిషనర్ రామయ్య గారి రమణమ్మ పర్యవేక్షణలో తిరునాళ్లను నిర్వహించారు. శుక్రవారం తెల్లవారుజామున నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సామాజిక అన్నదాన సత్రాలలో వేలాది మందికి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. వేలమంది అన్నదానంలో పాల్గొన్నారు. స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో తాగునీరు, మజ్జిగ పంపిణీ చేశారు. దేవస్థానం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.జిల్లా నలుమూలల నుంచి వచ్చిన భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. పట్టణంలోని టీడీపీకి నాయకులు ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభలతో పాటు బిజెఐఎం ఆర్తి ఆధ్వర్యంలో విద్యుత్ ప్రభలను ఏర్పాటు చేశారు. దేవస్థానం వద్ద దేవస్థానం ఆధ్వర్యంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. విద్యుత్ ప్రభలపై అశ్లీలత లేకుండా సాంస్కృతిక కార్యక్రమాలు, తోలుబొమ్మలాట కార్యక్రమాన్ని భక్తుల కోసం ఏర్పాటు చేశారు. చీరాల ఆర్డీవో చంద్రశేఖర నాయుడు దేవస్థానం వద్ద ఏర్పాటుచేసిన ప్రభుత్వ వివిధ శాఖలు ఏర్పాటు చేసిన స్టాల్‌లను పరిశీలించి సూచనలు సలహాలు ఇచ్చారు. మూడు రోజులు పాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మోదేపల్లి వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. రెవెన్యూ శాఖ, సమాచార కేంద్రం, పోలీస్ కంట్రోల్ రూమ్, పోలీస్ అవుట్ పోస్టు ద్వారా భక్తులకు సేవలందించారు.

ప్రత్యేక అలంకరణలో స్వామి దర్శనం..

తిరునాళ్ల సందర్భంగా శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. పండ్లు ఫలాలు వివిధ రకాల పూలతో ప్రసన్నాంజనేయ స్వామి వారు భక్తులకు దర్శనం ఇచ్చారు.

ప్లాస్టిక్ కవర్లు వినియోగించొద్దు..

- కార్పొరేషన్ కమిషనర్ వెంకటేశ్వరరావు
- కూరగాయల మార్కెట్‌లో తనిఖీలు


కూరగాయల దుకాణాల్లో తనిఖీ చేస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

ప్లాస్టిక్ కవర్లు వినియోగించొద్దని, ప్లాస్టిక్ వాడకం వల్ల క్యాన్సర్ వస్తుందని, ప్లాస్టిక్ నివారణకు అందరూ సహకరించాలని ఒంగోలు కార్పొరేషన్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు సూచించారు. ఒంగోలులోని కొత్త కూరగాయల మార్కెట్‌లో మున్సిపల్ సిబ్బందితో కలిసి తనిఖీలు చేపట్టారు. షాపుషాపుకూ తిరిగి ప్లాస్టిక్ వల్ల వచ్చే అనర్థాలను వివరించారు. స్వచ్ఛ ఆంధ్ర.. స్వర్ణ ఆంధ్ర.. కార్యక్రమంలో భాగంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ప్లాస్టిక్ కవర్‌లో ఆహార పదార్థాలు ప్యాకింగ్ చేస్తే క్యాన్సర్ వస్తుందని, హోటల్ యాజమాన్యం ప్లాస్టిక్ బదులు అరటి ఆకులు, విస్తరాకులు, సిల్వర్ కవర్లు వాడాలని సూచించారు. లేకుంటే చట్ట ప్రకారం భారీగా జరిమానాలు విధిస్తామన్నారు. పశువులు ప్లాస్టిక్ కవర్లలో ఉండే ఆహారాన్ని తినే క్రమంలో కవర్లు కూడా తినడం వల్ల అవి చనిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అందువల్ల ప్లాస్టిక్ నివారణకు అందరూ సహకరించాలని కోరారు. స్వర్ణ ఆంధ్ర.. స్వచ్ఛ ఆంధ్ర.. కార్యక్రమంలో భాగంగా మరిన్ని కార్యక్రమలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛ ఆంధ్ర
పర్యావరణ ప్రత్యేక ఆఫర్
మా షాపు నందు మాంసమును కొనుటకు వచ్చిన వారు స్టీల్ బాక్స్ తెచ్చుకొన్నవారికి 1కేజి కి రూ 5/- తగ్గించబడును.
ప్లాస్టిక్ కవర్లు ఇవ్వబడవు

స్టీల్ బాక్సు తెచ్చుకుంటే డిస్కౌంట్ ఇస్తామని మాంసం దుకాణాదారుల ప్రకటన

మూడేళ్లుగా ప్రైవేటు భవనంలోనే..

- అప్పటి నుంచి అద్దె చెల్లిస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయులు
- భవనమే లేని పాఠశాల మోడల్ స్కూల్‌గా ఎంపిక
- విద్యాశాఖ అధికారుల తీరు ఇది


భవననిర్మాణం పునాదుల కోసం తీసిన గుంతలు


పాఠశాల నిర్వహిస్తున్న ప్రైవేటు భవనం ఇదే..

ప్రజాశక్తి- ఒంగోలు సిటీ

కొందరి చర్యలు విస్తు గొలుపుతాయి. వారికై వారు అలా చేస్తారో, లేదా ఎవరైనా ప్రేరేపిస్తారో చేస్తారోగాని వారి చర్యలు వింతగా ఉంటాయి. అవగాహన రాహిత్యం లేదా మరి ఏదైనా కారణం కావచ్చు. ఇలాంటి చర్యల కారణంగా 65 మంది విద్యార్థులు గత మూడేళ్లుగా ఇక్కట్లకు గురవుతున్నారు. జిల్లా కేంద్రమైన ఒంగోలుకు కూత వేటు దూరంలోని టంగుటూరు మండలం కొణిజేడు గ్రామంలో సిపిఎం చేపట్టిన ప్రజా చైతన్య యాత్రలో విషయం వెలుగు చూసింది. ప్రభుత్వ పాఠశాల ఉండాల్సిన చోట మనిషి లోతు గుంతలు ఉన్నాయి. అయితే అధునాతన మరుగుదొడ్డి, చుట్టూ ప్రహరీ చూపరులకు చోద్యంగా ఉంది. ప్రహరీ నిర్మించింది గుంతల రక్షణ కోసమా, మరుగుదొడ్డి రక్షణ కోసమా అనే సందేహం కలుగుతోంది. బ్రిటిష్ కాలానికి పూర్వం 1941లో కొణిజేడులో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను ఏర్పాటు చేశారు. ఆ పాఠశాల భవనాన్ని కూల్చివేసి ఎదురుగా ప్రైవేటు భవనంలో పాఠశాలను నిర్వహిస్తున్నారు. ఈ పాఠశాలను మోడల్ స్కూల్‌గా ప్రకటించడం వింతగా అనిపిస్తోంది.

కొణిజేడు గ్రామంలో 1941లో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఏర్పాటు చేశారు. అనంతరం మరో రెండు ప్రాథమిక పాఠశాలలు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఏర్పాటు చేశారు. స్థానికుల ఆదరణ లేకపోవడంతో రెండు ప్రాథమిక పాఠశాలలు గతంలో మూతపడ్డాయి. దీంతో బ్రిటీష్ కాలానికి ముందుకు ఏర్పాటు చేసిన పాఠశాల మాత్రమే ఉంది.

రెండు ఎస్‌సి కాలనీలు, ఒక బీసీ కాలనీకి చెందిన 400 కుటుంబాలకు పిల్లల కోసం ఏర్పాటు చేసిన ఈ పాఠశాల 2021 వరకూ సక్రమంగానే కొనసాగింది. 2020 - 21 ఆర్థిక సంవత్సరంలో నాడు-నేడు తొలి దశలో భాగంగా పాఠశాల అభివృద్ధి, మరుగుదొడ్డి,ప్రహరీ నిర్మాణానికి రూ.4.85 లక్షలు మంజూరయ్యాయి. అప్పట్లో అక్కడ పని చేస్తున్న ప్రధానోపాధ్యాయురాలు కె.అరుణ అంచనాలకు మించి (రూ 8.లక్షలతో) మరుగుదొడ్డిని భారీ స్థాయిలో నిర్మిం చినట్లు స్థానికుల కథనం. నూతన భవనం నిర్మించకుండా మరుగుదొడ్డి నిర్మించడం పట్ల స్థానికులు విభేదిస్తున్నారు. 2021లో పాత భవన మరమ్మతులకు రూ. రెండు లక్షలు మంజూరైనట్లు సమాచారం. సకాలంలో నిధులు ఖర్చు చేయనందున అవి వృథా అయినట్లు తెలిసింది. మరమ్మతుల స్థానంలో నూతన భవనం నిర్మాణం చేపట్టేందుకు స్థానికులు, ప్రధానోపాధ్యాయురాలు కొత్త భవనానికి ప్రతిపాదనలు పంపారు. నిధులు మంజూరు కాకముందే మూడేళ్ల క్రితం పాత భవనాన్ని కూల్చివేశారు. నిధులు మంజూరు అవుతాయన్న ధీమాతో సాధారణ ఎన్నికలకు ముందు నూతన భవనానికి మనిషి లోతున పునాదులు తీశారు. ఎన్నికల అనంతరం ప్రభుత్వం మారడంతో భవన నిర్మాణ పనులు నిలిచిపోయాయి. దీంతో పాఠశాలను అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. విద్యార్థులు మరుగుదొడ్లకు వెళ్లేందుకు రద్దీగా ఉన్న రోడ్డు దాటడం, మనిషి లోతున తీసిన పునాదులు గుంతలు దాటడం ప్రమాదభరితంగా తయారైంది.

మూడేళ్లుగా ప్రైవేట్ భవనంలో.....

2021లో పాఠశాల భవనం కూల్చివేయడంతో విద్యార్థులను స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు తరలించి అక్కడ క్లాసులు నిర్వహించారు. హైస్కూల్‌కు జూనియర్ కాలేజీ మంజూరు కావడంతో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రాథమిక పాఠశాల పిల్లలను ఖాళీ చేయాలని ఆదేశించాడు. దీంతో 2022లో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు స్థానికుల సహకారంతో ప్రైవేట్ భవనాన్ని అద్దెకు తీసుకొని మూడేళ్లుగా పాఠశాలను నిర్వహిస్తున్నారు. అయితే ఈ విషయం గురించి ముందస్తుగా జిల్లా ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వనందున నిర్వహణ ఖర్చులు(ఇంటి అద్దె, కరెంట్ బిల్లులు) సిబ్బంది వ్యక్తిగతంగా భరించటం గమనార్హం. ఈ పాఠశాలలో ప్రస్తుతం 65 మంది విద్యార్థులు ఉన్నారు. ముగ్గురు టీచర్లు, ఓ విద్యా వాలంటీర్ చేస్తున్నారు. సొంత భవనం లేని పాఠశాలకు ఎంఇఒ సూచన మేరకు ఫిబ్రవరి 3న మోడల్ స్కూల్ గా అనుమతించాలని కోరుతూ స్థానిక హెడ్మాస్టర్ నాగేశ్వరరావు, పాఠశాల మేనేజ్మెంట్ చైర్మన్ పునుగుమాటి బాలాజీ దరఖాస్తు చేశారు.

పాఠశాలను స్వయంగా సందర్శిస్తా

డిఇఒ, ప్రవీణ్ కుమార్

పాఠశాలను స్వయంగా పరిశీలించి తగు చర్యలు చేపట్టనున్నట్లు డిఇఒ అత్తోట కిరణ్ కుమార్ తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరానికి నూతన భవన నిర్మాణానికి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మోడల్ స్కూల్ గా ఎంపిక చేశాం

ఎంఇఒ చెంచు పున్నయ్య

పాఠశాల నూతన భవన నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాం. సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి ప్రత్యేక శ్రద్ధ వహించి భవనాన్ని త్వరలో పూర్తి చేయాలని ఆదేశాలు ఇచ్చారు. దీంతో ఈ పాఠశాలను మోడల్ స్కూల్ గా కూడా ఎంపిక చేశాం.

పాఠశాల భవనాన్ని తక్షణమే నిర్మించాలి

మద్దులూరి కోటయ్య, సిపిఎం నాయకులు



ప్రైవేటు భవన యజమాని ఇప్పటికే చాలాసార్లు పాఠశాలను ఖాళీ చేయమని ఒత్తిడి చేశారు. హెడ్మాస్టర్, ప్రజలు బతిమి లాడటంతో ప్రస్తుతం పాఠశాల నిర్వహించు కొనేందుకు అంగీకరించారు. పిల్లలు టాయిలెట్‌కు వెళ్లేటప్పుడు ప్రమాదాలకు గురవుతున్నారు.ఈ నేపథ్యంలో పాఠశాల భవనాన్ని వెంటనే నిర్మించాలి.

రాజమండ్రి ఎమ్మెల్యే శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

విద్యాశాఖ సమగ్ర శిక్షలో పనిచేస్తున్న ఆర్ట్, క్రాఫ్ట్, పిఇటిల సమస్యలపై అసెంబ్లీలో చర్చించిన రాజమండ్రి ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్‌కు ప్రకాశంజిల్లా పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్స్ ఫెడరేషన్ నేతలు కృతజ్ఞతలు తెలియజేశారు. అసెంబ్లీలో రాజమండ్రి ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్స్ పదం తీసివేయాలని, ఫుల్ టైం ఒకేషనల్ టీచర్స్‌గా పేరు మార్చాలని కోరారు. వారికి ఉద్యోగ భద్రత కల్పించి మినిమం టైం స్కేల్ అమలు చేయాలని రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్‌ను కోరారు. తమ సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించిన రాజమండ్రి ఎమ్మెల్యేకు ప్రకాశం జిల్లా పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్స్ ఫెడరేషన్ రాష్ట్ర జెఎసి ప్రధాన కార్యదర్శి కళ్యాణి, జిల్లా అధ్యక్షుడు టి.రవికుమార్, కోశాధికారి మధు, జిల్లా నాయకులు శాస్త్రిజీ, సుశీల, వెంకటరత్నం,వెంకటేశ్వర్లు, ఆనంద్, కిరణ్ కృతజ్ఞతలు తెలియజేశారు.

చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-సంతనూతలపాడు

సంతనూతలపాడు మండలం పి.గుడిపాడు గ్రామ సమీపంలోని శ్రీఅభయ వీరాంజనేయ స్వామి దేవస్థానం, గోశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆలయ ప్రతినిధి తిరుమలశెట్టి అంజిబాబు ఆధ్వర్యంలో విశ్వమాత సోషల్ సర్వీస్ సొసైటీ నిర్వాహకురాలు కమ్మిశెట్టి లక్ష్మి శుక్రవారం ప్రారంభించారు. తొలుత ఒంగోలు గాంధీరోడ్డులోని పెండ్యాల ఆర్యవైశ్య సత్రం నిర్వాహకురాలు అయినాల శబూదేవి బృందం గోపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా కమ్మిశెట్టి లక్ష్మి మాట్లాడుతూ గత ఏడు సంవత్సరాల నుంచి వేసవిలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి పాదచారుల దాహార్తి తీర్చడానికి అంజిబాబు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో యోగ శిక్షకుడు చుండూరు శ్రీనివాసరావు, ధనిశెట్టి రామునాయుడు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

పొగాకు బేళ్ల అమ్మకం

ప్రజాశక్తి-కొండపి

పొగాకు వేలం కేంద్రానికి తంగెళ్ల, జాల్లపాలెం, పీరాపురం, ముక్కోడిపాలెం, తాటాకులపాలెం గ్రామాలకు చెందిన రైతులు 226 పొగాకు బేళ్లను తీసుకొచ్చారు. అందులో అందులో 160 బేళ్లు అమ్ముడు పోయాయి. వివిధ కారణాల చేత 66 బేళ్లను తిరస్కరించారు. కిలో పొగాకు అత్యధిక ధర రూ. రూ.280, అత్యల్ప ధర రూ.270, సరాసరి ధర 277.25 పైసలు పలికినట్లు వేలం కేంద్ర నిర్వహణాధికారి జి సునీల్ కుమార్ తెలిపారు. పొగాకు వేలంలో పది కంపెనీలు చెందిన ప్రతినిధులు పాల్గొన్నట్లు ఆయన తెలిపారు.


పరీక్ష సామగ్రి అందజేస్తున్న సేవాసమితి సభ్యులు

పరీక్ష సామగ్రి అందజేత

ప్రజాశక్తి-చీమకుర్తి

స్థానిక ఎస్‌కెఆర్ బధిరుల పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు స్వాంతన సేవా సమితి ఆధ్వర్యంలో పరీక్షా సామగ్రి శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా సేవా సమితి డైరెక్టర్ జయకుమార్ మాట్లాడుతూ బధిర విద్యార్థులకు పరీక్షా సామగ్రి అందజేయడం ఆనందంగా ఉందని అన్నారు. సామగ్రిని సద్వినియోగం చేసుకొని మంచి ఫలితాలు సాధించాలని కోరారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు ప్రేమ్‌కుమార్, ఏలియా, రాధ, జయమ్మ, పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్ అంజిరెడ్డి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

చెడుపై విజయానికి సంకేతమే హోలీ : ఎస్‌పి

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

చెడుపై సాధించిన విజయానికి సంకేతమే హోలీపండుగని ఎస్‌పి ఎఆర్. దామోదర్ తెలిపారు. జిల్లా పోలీస్ పెరేడ్ గ్రౌండ్ లో శుక్రవారం హోలీ వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకల్లో ఎస్‌పి, పోలీస్ అధికారులు, సిబ్బంది, తమ పిల్లలతో కలిసి పాల్గొన్నారు. ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ సందడి చేశారు.. పలువురు సిబ్బంది, వారి పిల్లలకు ఎస్‌పికి రంగులు పూసి హోలీ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్‌పి మాట్లాడుతూ జిల్లా ప్రజలందరూ ఆనందో త్సాహాలతోహోలీ పండుగను నిర్వహించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ వేడుకల్లో ఎఆర్ అదనపు ఎస్‌పి అశోక్‌బాబు, ఐటి కోర్ సిఐ సూర్యనారాయణ, ఆర్ఐ రమణారెడ్డి, ఆర్ఎస్ఐలు పోలీసు సిబ్బంది, వారి పిల్లలు పాల్గొన్నారు. అదేవిధంగా ఒంగోలు నగరంలోని పలు ప్రాంతాల్లో హోలీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఒకరిపై ఒకరూ రంగులు చల్లుకుంటూ సందడి చేశారు. చిన్నారులు రంగులు చల్లుకుంటూ కేరింతలు కొట్టారు.


హోలీ వేడుకల్లో ఎస్‌పి దామోదర్


హోలీ వేడుకల్లో చిన్నారులు


రంగులు పూసుకుంటున్న యువకులు


రంగులు పూసుకుంటున్న బాలికలు


హోలీ వేడుకల్లో చిన్నారి

దోబీ ఘాట్ల భూమిని కాపాడాలి



ఆక్రమణకు గురైన దోబీ ఘాటు పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - హనుమంతునిపాడు

మండల కేంద్రంలోని రజకులకు సర్వే నెంబర్ 52-1ఎ లో ఇచ్చిన 8.12ఎకరాల ధోబిఘాట్ల భూమి అన్యాక్రాంతం అవుతుందని, దీనిని ప్రభుత్వ అధికారులు జోక్యం చేసుకొని కాపాడాలని సిపిఎం నాయకులు బడుగు వెంకటేశ్వర్లు, రజక వృత్తిదారుల సంఘం జిల్లా నాయకులు రాయల మాలకొండయ్య కోరారు. శుక్రవారం జరిగిన ప్రజా చైతన్య యాత్ర సందర్భంగా ధోబి గాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 30ఏళ్ల క్రితం నాటి తెలుగుదేశం ప్రభుత్వం బీసీలకు ఆదరణ పథకం కింద రజక వృత్తిదారుల కులవృత్తిని కాపాడుతూ ఉపాధి కల్పించుటకు బోర్, ధోబి గాట్లు నిర్మించారని అన్నారు. నాటి నుండి 90 కుటుంబాలకు చెందిన రజకులు వాటిని ఆధారం చేసుకుని జీవనం కొనసాగిస్తున్నారని అన్నారు. కొంత కాలం క్రితం బోరును అక్రమంగా దొంగలించాక దోబీ ఘాట్లు మూలనపడ్డాయని, అప్పటి నుండి స్థానిక పేదలు గత పదేళ్ల కాలంలో అధికారులకు అర్జి రూపంలో తెలియజేస్తున్నప్పటికీ పరిష్కారం కాలేదని తెలిపారు. నేటి కూటమి ప్రభుత్వం బీసీలకు ఆదరణ పథకం తిరిగి ముందుకు తీసుకురావడంతో ఈ పథకం ద్వారా ధోబి గాట్లను అభివృద్ధి చేసి తిరిగి రజక వృత్తి దారులకు ఉపాధి కల్పించాలని విజ్ఞప్తి చేశారు. దోబీ గాట్ల స్థలానికి ఆక్రమ దారులు కంచె వేసి ఆక్రమిస్తున్నారని, కొంత స్థలం పంటలు వేస్తున్నారని, మరికొంత స్థలాన్ని ఇతర అవసరాలకు వాడుతూ మొత్తం స్థలాన్ని అన్యాక్రాంతం చేశారని తెలిపారు. రెవిన్యూ సదస్సులో ఇదే విషయంపై ఫిర్యాదు చేయగా సర్వే చేసి హద్దులేసి స్థలం అప్పగిస్తామన్న అధికారుల హామీ నెరవేరలేదని తెలిపారు. గ్రామంలో డ్రైనేజీ నీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. రజక కాలనీలో డ్రైనేజీ లేదని, పారిశుధ్యం అధ్వానంగా ఉందని తెలిపారు. ఎస్సీ మాదిగ పాలెంలో రోడ్డు నిర్మాణ పనుల వలన సాగర్ పైపులైను పగిలిపోవడంతో గత కొంత కాలం నుంచి తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని తెలిపారు. వెంటనే పైపులైన్ మరమత్తులు చేసి తాగునీటి సమస్య తీర్చాలని కోరారు. దళితవాడలో ఉన్న వాటర్ ట్యాంక్ నిరుపయోగంగా మారిందని అన్నారు. ఈ ట్యాంకర్‌కు నీళ్ల సరఫరా చేస్తున్న బోరు చెడిపోవడంతో వాడుక నీరుటికి ఇబ్బంది పడుతున్నట్లు తెలిపారు. వేసవిలో నీటి సమస్య మరింత తీవ్రంగా ఉందని అన్నారు. బోరు రిపేరు చేయించి వాడుక నీరు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాచర్ల బాలకృష్ణ, చందు, తిరుమల్పూడి నాగేశ్వర్, వినుకొండ చెన్నయ్య, బ్రహ్మయ్య, తిరుమలపూడి చెన్నమ్మ, చీమలదీన్నే చిన్న కుమారి, ఆర్నూరి చెన్నారావు, లక్ష్మయ్య, మాచర్ల బాలుడు పాల్గొన్నారు.

కనిగిరి : పట్టణంలోని రాజు నగర్ కాలనీలో సిపిఎం ప్రజా చైతన్య యాత్ర శుక్రవారం సాయంత్రం నిర్వహించారు. కాలనీలో మురుగునీటి కాలువల సమస్య తీర్చాలని కోరారు. మురుగునీటి పారుదల లేక రోడ్లపై మురుగు పారుతోందని, దుర్వాసన, దోమలతో ఇబ్బందులు పడుతున్నట్లు కాలనీ వాసులు సిపిఎం నేతల దృష్టికి తెచ్చారు. వాటర్ పైప్ లైన్ మురికి నీటిలో ఉండటంతో కలుషితం అవుతుందని వాపోయారు. మురుగు కాలువల నిర్మాణ సమస్య మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని సిపిఎం నాయకులు తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు మాలకొండయ్య, రమణమ్మ, నరేంద్ర, ప్రసన్న, ప్రసంగి, స్థానికులు సరోజ, సుజాత, రత్తమ్మ, భాగ్యమ్మ పాల్గొన్నారు.



సమస్య తెలుసుకుంటున్న సిపిఎం కార్యదర్శి పిసి కేశవరావు



ప్రభపై మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యేలు అన్నా, ఉడుముల

భవిష్యత్తు వైసిపిదే..: అన్నా

ప్రజాశక్తి- కొనకనమిట్ల

భవిష్యత్తు వైసిపిదేనని, ఎవరు అధైర్య పడవద్దని గిద్దలూరు, కంభం మాజీ ఎమ్మెల్యేలు అన్నా వెంకట రాంబాబు, ఉడుముల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని మునగపాడు చౌడేశ్వరమ్మస్వామి తిరుణాల సందర్భంగా ఏర్పాటు చేసిన వైసిపి విద్యుత్ ప్రభలపై వారు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు ఒరగబెట్టిందేమీ లేదని అన్నారు. ఇచ్చిన హామీలు నెరవేర్చటం లేదని దుయ్యబడ్డారు. ప్రజలకు హామీలు గుప్పించి గద్దెనేక్కిన కూటమి ప్రభుత్వం హామీలు నెరవేర్చడంలో వైఫల్యం చెందారన్నారు. సూపర్ సిక్స్ పథకంలో పింఛన్ తప్ప మిగతా పథకాలేమి నెరవేర్చలేదని దుయ్యబట్టారు. గత జగనన్న ప్రభుత్వంలో అన్ని పథకాలు ప్రజలకు నిరంతరం అందజేసినట్లు గుర్తు చేశారు. విద్యుత్ బిల్లులు పెంపు, ఇసుక, మద్యం ధరలు తగ్గిస్తానని చెప్పి నేడు అధిక భారాలు వేయటంతో ప్రజలు గగ్గోలు పెడుతున్నారని విమర్శించారు. అన్నదాత సుఖీభవ, నిరుద్యోగ భృతి ఇప్పటికీ అమలు చేయలేదని అన్నారు. అధికారం ఉన్నా లేకున్నా ఎప్పుడు ప్రజల పక్షాన పోరాడుతూనే ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ మోరబోయిన మురళీ కృష్ణ, జడ్‌పిటిసి అక్కిదాసరి ఏడుకొండలు, వైసిపి మండల కన్వీనర్ మోరా శంకర్‌రెడ్డి, ఆర్యవైశ్య సంఘం మాజీ మండల అధ్యక్షులు గర్రె శ్రీనివాసులు, మునగపాడు, వెలిగండ్ల, గనివెనపాడు సర్పంచులు పార్లపల్లి సిద్ధాభి నబి, పాతకోట వెంకటరెడ్డి, పాలూరి లక్ష్మీవెంకటేశ్వర్లు, రేగడపల్లి సింగిల్ విండో అధ్యక్షులు కామసాని వెంకటేశ్వర్‌రెడ్డి, ఎస్సీ నాయకులు సిహెచ్ కోటేశ్వరరావు, మాజీ ఎంపిటిసి చంద్రశేఖర్, బత్తుల రవి, శ్రీను పాల్గొన్నారు.



జనసేన ఆవిర్భావ దినోత్సవం నిర్వహిస్తున్న నాయకులు

ఘనంగా జనసేన ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి-సిఎస్.పురం

జనసేన 12వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఆ పార్టీ నాయకులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పార్టీ కార్యకర్తలు కేక్ కట్ చేసి పంచిపెట్టారు. జనసేన నాయకులు సమ్మన తిరుపతి ఆధ్వర్యంలో బెంగళూరులోని బెల్లందుర్‌లో జనసేన ఆవిర్భావ దినోత్సవ వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు పేదలకు అన్నదానం చేశారు. జనసేన పార్టీని ముందుకు తీసుకు వెళ్లే విధంగా కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జనసేన నాయకులు సమ్మన రమణయ్య, గంటా నారాయణరెడ్డి, కాలేస్ నారాయణ, రాంబాబు, సురేష్, కాజారెడ్డి రత్తయ్య, వంశి అనిల్, నరసింహ పాల్గొన్నారు.

ఘనంగా కనకదుర్గమ్మ తిరునాళ్ల

ప్రజాశక్తి - దొనకొండ

మండలకేంద్రమైన దొనకొండలో కనకదుర్గమ్మ దేవాలయంలో అమ్మవారి తిరునాళ్ల మహోత్సవ వేడుకలు కన్నులపడుగగా శుక్రవారం నిర్వహించారు. ఇతర ప్రాంతాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్త ధనివేలు ఆధ్వర్యంలో అభిషేకాలు, అర్చన, సామూహిక కుంకుమ పూజలు, ప్రసాద వినియోగం, మధ్యాహ్నం భారీగా అన్నదానం నిర్వహించారు. వేడుకల సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయాన్ని విద్యుద్దీపాలంకరణ చేశారు.

కాటేరు వాగుపై వంతెన నిర్మించాలి

ప్రజా చైతన్య యాత్రలో పరిశీలించిన సిపియం నాయకులు



కాటేరు వాగుపై బ్రిడ్జీ నిర్మించాలని డిమాండ్ చేస్తున్న సిపిఎం

ప్రజాశక్తి-దర్శి

పట్టణంలోని తహశీల్దారు కార్యాలయం వద్ద పొదిలి రోడ్డులోని కాటేరు వాగుపై వంతెన నిర్మించాలని సిపిఎం మండల కార్యదర్శి సందు వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఎం నాయకులు ప్రజాచైతన్య యాత్రలో భాగంగా వాగును సిపిఎం నాయకుల బృందం శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా విలేఖరులతో ఆయన మాట్లాడుతూ వర్షాలు పడినప్పుడు చప్టాపై వర్షపునీరు అయిదు అడుగుల ఎత్తు వరకు నిలవటంతో బస్సులు, ఆటోలు తదితర వాహనదారులు గంటల తరబడి ట్రాఫిక్ ఆగవలసి వస్తుందని, పొదిలి, అద్దంకి, వినుకొండకు వెళ్లే ప్రధాన రహదారి కావడంతో ప్రజలు త్రీవమైన ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుందన్నారు. కనీసం వాగుకి రెండు వైపుల సిమెంటు దిమ్మెలు లేకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉందని తెలిపారు. అనేక మంది మోటరు సైకిల్, ఆటోల వారు ప్రమాదాలకు గురవుతున్నారు. ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతుంది. గత 15ఏళ్ల నుంచి చప్టా మొత్తం పగిలిపోయి, గుంతలు ఏర్పడినా ఇక్కడ నుంచి గెలుపొందిన ప్రతినిధులు పట్టించుకోవడం లేదు. ఎన్నికలప్పుడు బ్రిడ్జీ నిర్మిస్తామని వాగ్దానం చేయటం మినహా బ్రిడ్జి నిర్మాణానికి నిధులు కేటాయించడం గురించి పట్టించుకోవడం లేదని విమర్శించారు. ప్రభుత్వం, ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి స్పందించి వంతెన నిర్మాణానికి నిధులు కేటాయించి, పనులు ప్రారంభించి వంతెన నిర్మాణం పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు తాండవ రంగారావు, సిపిఎం మండల కార్యదర్శి సందు వెంకటేశ్వరరావు, ఉప్పు నారాయణ, ఈమని నాగేశ్వరరావు, ఎస్‌కె కాలేభాషా, కెవి పిచ్చయ్య, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. వాహనదారులు పెద్ద సంఖ్యలో సిపిఎం కృషికి అభినందనలు తెలిపారు.



పరీక్షలపై అవగాహన కల్పిస్తున్న తాళ్ళూరు ఎంఇఓలు

పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు

ప్రజాశక్తి-తాళ్ళూరు

మండలంలో 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు 6సెంటర్లలో 825 మంది విద్యార్థులు 17 నుండి పరీక్షలు రాయనున్నట్లు ఎంఇఓ జి సుబ్బయ్య, ఎల్ సుధాకర్‌రావు తెలిపారు. విద్యార్థులకు పరీక్ష కేంద్రంలో అవసరమైన వసతులు కల్పించినట్లు తెలిపారు. పరీక్ష గదుల్లో వెలుతురు, బల్లాలు, తాగునీరు, మరుగుదొడ్ల వసతులు కల్పించినట్లు తెలిపారు.

రెండో బైపాస్ కోసం మాగుంట సమీక్ష



ఎంపి మాగుంట శ్రీనివాసులురెడ్డితో చర్చిస్తున్న అధికారులు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు నగరం పడమర వైపు రెండో బైపాస్‌పై ఒంగోలు పార్లమెంట్ సభ్యులు ఎంపి మాగుంట శ్రీనివాసులురెడ్డితో ఒంగోలు నేషనల్ హైవేస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ విద్యా సాగర్, ఆర్ అండ్ బి ఈఈ గోపి నాయక్ సమావేశం అయ్యారు. విజయవాడలోని ఎంపి కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో పలు అంశాలు చర్చించారు. ఒంగోలు నగరానికి పడమర వైపు 2వ బైపాస్ కావాలని ఇటీవల కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రి నితిన్ గడ్కరీని ఎంపి మాగుంట శ్రీనివాసులురెడ్డి కలసి వినతిపత్రం ఇచ్చారు. ఒంగోలు నగరం నుంచి తూర్పు నాయుడుపాలెం (వయా మైనంపాడు, ఎండ్లూరు, కందులూరు గ్రామాల మీదుగా) వెల్లంపల్లి వరకు 2వ బైపాస్ అవసరమని కోరారు. ఇదే విషయమై విజయవాడలోని మాగుంట కార్యాలయంలో ఆయనను కలిసిన అధికారులు 2వ బైపాస్ సింగరాయకొండ వద్ద ఉన్న ఎమర్జెన్సీ ల్యాండింగ్‌పై నేషనల్ హైవేస్ ఒంగోలు ప్రాజెక్ట్ డైరెక్టర్ విద్యా సాగర్, ఆర్‌అండ్‌బి ఈఈ గోపి నాయక్ చర్చించారు.



శక్తి యాప్ ఆవిష్కరిస్తున్న డిఎస్పి సాయి ఈశ్వర్ యశ్వంత్

శక్తి యాప్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - కనిగిరి

శక్తి యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని డిఎస్‌పి సాయి ఈశ్వర్ యశ్వంత్, ఎస్ఐ టి శ్రీరాం కోరారు. స్థానిక డిఎస్పి కార్యాలయంలో శుక్రవారం శక్తి యాప్ ఆవిష్కరించారు. ప్రభుత్వం మహిళలు, బాలికల భద్రత చర్యల్లో భాగంగా ఏర్పాటు చేసిన శక్తి యాప్ ప్రకాశం జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో సబ్ డివిజన్లోని వివిధ పోలీసు స్టేషన్లో మహిళలు, బాలికలకు సేవలందించేందుకు వీలుగా శక్తి టీంలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆండ్రాయిడ్ మొబైల్స్ ఉన్న ప్రతి ఒక్కరూ ఈ యాప్ డౌన్లోడ్ చేసుకొని యాప్ ద్వారా అందించే సేవలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

ప్రజాశక్తి-మార్టూరు రూరల్

పర్చూరు నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అగ్రగామిగా నిలపడమే తన లక్ష్యమని విజనరీ లీడర్ అవార్డు గ్రహీత ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు. శుక్రవారం ఇసుక దర్శిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రజా దర్బార్లో భాగంగా ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఏలూరి మాట్లాడుతూ ప్రజా సంక్షేమం అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో అస్తవ్యస్తంగా ఉన్న పాలనను ముఖ్యమంత్రి చంద్రబాబు గాడిలో పెట్టేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. అపార అనుభవం విజన్ కలిగిన చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని ఎమ్మెల్యే ఏలూరి అన్నారు. అభివృద్ధి, సంక్షేమం దిశగా పనిచేశానన్నారు. సీఎం చంద్రబాబు సహకారంతో నియోజకవర్గాన్ని రాష్ట్రంలో ఒక రోల్ మోడల్గా నిలిపేందుకు కృషి చేస్తున్నానన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందిస్తానన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఏలూరికి పెయింటింగ్తో గీసిన ఎమ్మెల్యే చిత్రపటాన్ని విశ్రాంత ఇంజనీర్ సత్యనారాయణ అందజేశారు.



ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

జనసేనానికి శుభాకాంక్షలు

జనసేన పార్టీ 12వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, నేతలు, కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలిపారు. ఏపీ ఆర్థిక, సామాజిక అభివృద్ధికి జనసేన చిత్తశుద్ధితో పని చేస్తోందన్నారు. రాష్ట్రాభివృద్ధిలో జనసేన కీలక పాత్ర పోషించిందన్నారు.

మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ

ప్రజాశక్తి-అద్దంకి

సింగరకొండ తిరునాళ్ల సందర్భంగా భక్తులకు లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, అద్దంకి బ్రాంచ్ తరఫున మజ్జిగ ప్యాకెట్లు, వాటర్ బాటిళ్లు పంపిణీ చేశారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఈ కార్యక్రమంలో అద్దంకి బ్రాంచి సీనియర్ బ్రాంచ్ మేనేజర్ వి.మాధవ్ కృష్ణ ఎల్ఐసికి సంబంధించి వివిధ బ్రోచర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి అత్యవసరమైన లైఫ్ ఇన్సూరెన్స్లో అందరూ భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏబిఎం ఖాదర్ మస్తాన్, యూనియన్ సెక్రటరీ తోటకూర సత్యనారాయణ, చుండూరు నరసింహ రావు, కోట శ్రీనివాస రావు, భాస్కరణ శ్రీనివాసరావు, ఆర్బీసీ సుబ్బారావు, వల్లెం నాగేశ్వరరావు, ఏజెంట్లు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో పాల్గొన్న మండల స్థాయి అధికారులు

'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర'పై అవగాహన

ప్రజాశక్తి-వేటపాలెం

ప్రతినెలా మూడో శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలను నిర్వహించాలని మండల ప్రత్యేక అధికారి జె.రాజా డెబోరా అన్నారు. శుక్రవారం స్థానిక మండల ప్రజా పరిషత్ సమావేశ హాలులో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పి-4 సర్వేను నిర్దేశించిన అంశాలతో సమగ్రంగా నిర్వహించాలని సూచించారు. అసంపూర్తిగా మిగిలిపోయిన ఇళ్ల లబ్ధిదారులకు ప్రభుత్వ పరంగా అందించనున్న అదనపు ఆర్థిక సహాయం గురించి అవగాహన కల్పించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మెడబలిని రాజేష్ బాబు, అన్నం శ్రీనివాసరావు, వ్యవసాయ శాఖ అధికారి ఐ కాశీ విశ్వనాథం, డిఆర్డిఏ అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ కాటి అంజిబాబు, హౌసింగ్ ఏఈ, పంచాయతీ సెక్రటరీలు వేమూరి రామ్మోహన్రావు, షేక్ గౌస్ మొహుద్దీన్ అలీ, మోతుకూరి మోహన్ రంగారావు, బాలిగ సురేంద్ర బాబు, బడుగు రమేష్ బాబు, తాటి మాల్యాద్రి రావు, నక్కల శ్రీనివాసరావు, హౌసింగ్ వర్క్ ఇన్స్పెక్టర్ భాస్కరమ్మ, డేటా ఎంట్రీ ఆపరేటర్ భూపతి గౌతమ్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు అమర్ రఘు, టిడిపి నాయకులు పులి వెంకటేశ్వర్లు, గవిని పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

వారానికో రోజు గ్రామాల్లో పర్యటిస్తా

ఎమ్మెల్యే నరేంద్ర వర్మ

ప్రజాశక్తి-బాపట్ల

ప్రజా సమస్యల పరిష్కారం కోసం వార్డులు, గ్రామపంచాయతీల్లో వారంలో ఒకరోజు పర్యటించి ప్రజా సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తానని శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ అన్నారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక తొలిసారిగా వార్డులు, గ్రామ పంచాయతీల్లో పర్యటనకు ఈనెల 24 నుంచి శ్రీకారం చుడుతున్నామన్నారు. పర్యాటక కేంద్రమైన సూర్యలంక బీచ్ని అభివృద్ధి చేయటం ద్వారా నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలతో పాటు ప్రభుత్వానికి రాబడి లభిస్తుంది అన్నారు. ఈ ప్రాంతం బోట్ టూరిజానికి అనువైన ప్రాంతంగా ఉందన్నారు. 18 కిలోమీటర్లమేర ఇక్కడ సూర్యలంక-బాపట్ల మార్గంలో పేరలి డ్రెయిన్ ద్వారా నిజాంపట్నం వరకు 18 కిలోమీటర్ల బోటు షికారు, ఫ్యామిలీ బోటింగ్, పార్టీ బోటింగ్, కేరళ బోటింగ్ పర్యాటకులకు అద్భుతమైన అనుభూతిని కలిగిస్తుంది అన్నారు. 1980లో కట్టిన మంచినీటి చెరువును అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. సోలార్ పవర్ సిస్టం ద్వారా ఎస్సీ, ఎస్టీలకు రాయితీపై విద్యుత్ అందజేయడం జరుగుతుందన్నారు. ఈ విధానంతో రానున్న రోజుల్లో విద్యుత్కు ఏమాత్రం సమస్య ఉండబోదన్నారు. ఈ సమావేశంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు, మండల పార్టీ అధ్యక్షుడు ముక్కామల శివ, కర్లపాలెం పార్టీ అధ్యక్షుడు ఏపూరి భూపతిరావు, పార్టీ నాయకులు బాజీ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నరేంద్ర వర్మ

విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేత

ప్రజాశక్తి-పంగులూరు

మండలంలోని బూదవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు పర్చూరు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం అట్టలు, పెన్నులు, పెన్సిళ్లు, స్కేలు, ఎరైజర్స్, మొదలైన వాటిని బహూకరించారు. నర్రా వెంకటేశ్వర్లు ఆయన సతీమణి లక్ష్మీ సుధా సౌజన్యంతో వీటిని పర్చూరు రోటరీ ఇన్చార్జ్ అధ్యక్షులు నాగభైరు శ్రీనివాసరావు, సెక్రటరీ కోమటి ఆంజనేయులు ద్వారా విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నాగరాణి, కల్వ సోమశేఖర్, సిహెచ్. శ్రీనివాసరావు, సిహెచ్ లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



అట్టలు పంపిణీ చేసిన దాతలు

గుంతలతో పొంచి ఉన్న ప్రమాదం

పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి-వేటపాలెం

వేటపాలెం మండల కేంద్రంలోని పంచాయితీ పైలెట్ ప్రాజెక్టు త్రాగునీరు సరఫరా చేసే పైపులైన్ మరమ్మతులకు గురైంది. రెండు రోజుల క్రితమే చల్లారెడ్డి పాలెం పంచాయితీ పరిధిలోని కుందేరు దాటిన తరువాత 216 జాతీయ రహదారికి దగ్గరగా అధికారులు పైప్లైన్ మరమ్మతుల కోసం గుంత తీసి మట్టిని రోడ్డు వెంబడి దిబ్బ వేశారు. ఇది కాస్తా ప్రమాదకరంగా మారింది. రాత్రి వేళ ద్విచక్ర వాహనదారులు మట్టిదిబ్బ కనపడక ప్రమాదాల బారిన పడుతున్నారు. కనీసం ఈ రహదారిలో వీధిలైట్లు లేకపోవడంతో అధికారుల నిర్లక్ష్యం తమకు శాపంగా మారిందని పలువురు వాహన చోదకులు ఆరోపిస్తున్నారు. ఏదైనా జరగరాని ప్రమాదం జరిగితే ఎవరిది బాధ్యత అంటూ ప్రశ్నిస్తున్నారు. ఇటీవల పొట్టి సుబ్బయ్య పాలెం వద్ద ఇలాగే గ్రావెల్ దిబ్బలను ఎక్కించి ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న ఇద్దరు యువకులలో ఒక యువకుడుకి తలకు తీవ్ర గాయాలయి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. మరో యువకుడు మంచానికే పరిమితం అయ్యాడు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదాలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



ప్రమాదకరంగా మారిన మట్టి దిబ్బ



మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి ప్రకాశ్రావు

పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి-యద్దనపూడి

స్థానిక మండల ప్రజా పరిషత్ యద్దనపూడి మండలం కార్యాలయంలో శుక్రవారం పంచాయతీ సెక్రటరీలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు రివ్యూ మీటింగ్ సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో ప్రత్యేక అధికారి ప్రకాశ్రావు మాట్లాడుతూ హౌసింగ్ అప్లికేషన్ను త్వరగా కంప్లీట్ చేసి లబ్ధిదారులను గుర్తించాలన్నారు. స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణ ఆంధ్రలో భాగంగా మూడో శనివారం శానిటేషన్పై దృష్టి సారించాలన్నారు. తడి చెత్త, పొడి చెత్తను సేకరించి యస్.డబ్ల్యు.పి.సి షెడ్లకు తరలించి ప్రాసెస్ చేయాలన్నారు. ఇన్ఛార్జి ఎంపీడీవో కృష్ణ మాట్లాడుతూ రోడ్లు వెంబడి చెత్తను తొలగించాలన్నారు. పి4 సర్వేను సక్రమంగా చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పి.రాణి, శివ ప్రసాద్, మోహన్ బాబు, శ్రీను, శరత్, ప్రభాకర్, నాగేష్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, గృహనిర్మాణ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి వేణుగోపాల్

గృహ నిర్మాణాలను వేగంగా పూర్తిచేయాలి

ప్రజాశక్తి-కారంచేడు

కారంచేడు మండల పరిధిలోని గృహ నిర్మాణానికి అర్హత పొంది అసంపూర్తిగా ఉన్న గృహాలను గుర్తించి వాటిని పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కారంచేడు ఎంపీడీవో నేతాజీ అన్నారు. మండల పరిధిలోని పంచాయతీ సెక్రటరీలు, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, గృహ నిర్మాణ శాఖ సిబ్బందితో శుక్రవారం సమావేశం నిర్వహించారు. సంబంధిత అధికారులు పెండింగ్ గృహాలను పరిశీలించి వారికి అవగాహన కల్పించి గృహ నిర్మాణాలు త్వరితగతన పూర్తయేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో నేతాజీ సిబ్బందికి సూచించారు. కారంచేడు మండల పరిధిలో మొత్తం 329 అసంపూర్తిగా ఉన్నాయన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి మూడవ శనివారం జరిగే స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం రోజున ప్లాస్టిక్ వాడకం తగ్గిస్తూ జూట్ బాగ్లు వంటి వాటి ఉపయోగం గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, గృహ నిర్మాణ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భట్టిప్రోలు: ప్రభుత్వం గృహ నిర్మాణ లబ్ధిదారులకు అదనపు సహాయం అందించనుందని, లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని మండల ప్రత్యేక అధికారి డి.వేణుగోపాల్ సూచించారు. ఈ సందర్భంగా శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లకు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2016 నుంచి 24 వరకు గృహాలు నిర్మించుకున్న బీసీ, ఎస్సీ లబ్ధిదారులకు ప్రభుత్వం అందించే బిల్లులతోపాటు అదనంగా 50 వేల రూపాయలను అందించడం జరుగుతుందన్నారు. అలాగే ఎస్టీలకు 75 వేల రూపాయలు చొప్పున అందించడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్.వెంకటరమణ, ఏపీవో శివ పార్వతి, గృహ నిర్మాణ శాఖ ఏఈ సౌమ్య రేవతి పాల్గొన్నారు.

కరాటే క్రీడాకారుడు

రోహన్‌కు సిఎం అభినందనలు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

కామన్వెల్త్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణ పతకం సాధించిన కరాటే క్రీడాకారుడు ఆర్. రోహన్‌ను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభినందించారు. ఇటీవల దక్షిణాఫ్రికాలోని డర్బన్‌లో నిర్వహించిన 11వ కామన్వెల్త్ చాంపియన్‌షిప్‌లో ఆంధ్రప్రదేశ్ కరాటే అసోసియేషన్‌కు చెందిన క్రీడాకారుడు ఆర్.రోహన్ 14బి,15 సంవత్సరాల ఎలైట్ విభాగంలో స్వర్ణ పతకం సాధించాడు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును శుక్రవారం రోహన్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ రోహన్ కషి, పట్టుదలతో దేశమంతా గర్వపడేలా చేశాడన్నారు. ఆంధ్రప్రదేశ్ స్పోర్ట్స్ కరాటే డో అసోసియేషన్ ప్రయత్నాన్ని సిఎం అభినందించారు. ఇది యువ క్రీడాకారులు అంతర్జాతీయ పోటీలలో భారత్ వేదికగా ఉంటుందన్నారు, యువత క్రీడలలో పాల్గొనటం, ప్రోత్సహించ టానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. రోహన్ శిక్షణ, అభివద్ధికి నగదు బహుమతిని ప్రకటించారు. భారత కరాటే జట్టు ప్రధాన కోచ్, ఎస్‌కెడిఎ ఏపి ప్రధాన కార్యదర్శి కె.కీర్తన్ ముఖ్యమంత్రి విజన్, రాష్ట్రంలో స్వీయ రక్షణ పట్ల చేస్తున్న కృషి పై ప్రశంసలు కురిపించారు. అంతర్జాతీయ పోటీలకు మరియు యువ క్రీడా కారులందరికి అవకాశాలు సమకూర్చే కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వం కీలక పాత్ర పోషిస్తుందన్నారు. రోహన్ విజయం యువత సామర్థ్యానికి సాక్ష్యమని తెలిపారు. ప్రతిభావంతులను పెంచేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును స్పోర్ట్స్ కరాటే డో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు నల్లూరి మోహనరావు కృతజ్ఞతలు తెలియజేశారు.



రోహన్‌ను అభినందిస్తున్న సిఎం చంద్రబాబు నాయుడు

ఇళ్ల స్థలాలు, తాగునీటి సమస్యతో ఇక్కట్లు

ప్రజా చైతన్య యాత్ర బృందం వద్ద కాలనీ వాసులు ఆవేదన

ప్రజాశక్తి- ఒంగోలు సిటీ

ఇళ్ల స్థలాలు, ఇంటి పన్నులు, తాగునీరు, డ్రైనేజీ సమస్యలతో తాము ఇక్కట్లకు గురవుతున్నట్లు ఒంగోలు నగరం 16వ డివిజన్ పరిధిలోని అగ్రహారం, అశోక్ నగర్, బాలాజీ నగర్, దత్తాత్రేయ కాలనీ, పోతురాజు పాలెం, గుర్రం జాషువా కాలనీ వాసులు కోరారు. సిపిఎం ఆధ్వర్యంలో ఆయా కాలనీల్లో ప్రజా చైతన్య యాత్ర శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా కాలనీవాసులు తమ సమస్యలను సిపిఎం బృందం వద్ద ఏకరువు పెట్టారు. మున్సిపాలిటీ ట్యాంకర్ల ద్వారా వారానికి ఒకసారి ఒక్కొక్క కుటుంబానికి రెండేసి డ్రమ్ముల నీరు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. ఆ నీరు ఏమాత్రం సరిపోవడం లేదన్నారు. కనీసం రెండు, మూడు రోజులకు ఒకసారి ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేయాలని కోరారు. గత 15 సంవత్సరాలుగా నివాసం ఉంటున్న తమ ఇళ్లకు పన్నులు వేయలేదని తెలిపారు. పన్నులు వేయాలని అనేకసార్లు అధికారులను కోరినప్పటికీ ప్రయోజనం లేదన్నారు. కాలనీ వాసులందరికీ వెంటనే ఇంటి పన్నులు వేయాలని కోరారు. సైడ్ కాలువలలో మురుగు పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతున్నట్లు తెలిపారు. మురుగు కారణంగా దోమలు విపరీతంగా వ్యాప్తి చెందుతున్నట్లు తెలిపారు. కాలువల్లోని మురుగును తొలగించి దోమల నివారణకు మందు చల్లాలని కోరారు. డ్రైనేజీ వ్యవస్థను అభివృద్ధి పరచాలన్నారు. శాశ్వత తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరారు. ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్న నీటిలో పురుగులు ఉండటంతో పిల్లలు వ్యాధులు బారిన పడుతున్నారని దత్తాత్రేయ కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. మురుగు కాలువలకు అవుట్లెట్ లేకపోవడం వల్ల మురుగు నిల్వ ఉన్నట్లు జాషువా కాలనీ వాసులు తెలిపారు. తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని వారు కోరారు. తొలుత మల్లేశ్వరపురం, నరసాపురంలో గత ఏడాది ఫిబ్రవరి 23న అప్పటి ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేసిన వైఎస్ఆర్ జగన్నకాలనీ లేఅవుట్లను సిపిఎం బృందం సందర్శించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి ఎస్‌కె.మాబు మాట్లాడుతూ నగరవాసుల సొంత ఇంటి కలలను నెరవేర్చడంలో పాలకవర్గాలు ఉదాసీనతను విడనాడాలన్నారు. పట్టాల పంపిణీ పేరుతో గత ప్రభుత్వం, సర్వేల పేరుతో కూటమి ప్రభుత్వం కాలయాపన చేస్తూ ప్రజలను మోసగిస్తున్నట్లు తెలిపారు. అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేసి పొజిషన్ చూపించాలని డిమాండ్ చేశారు. సిపిఎం నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఒంగోలు నగరంలో గత 20 ఏళ్లుగా ఎన్యుమరేషన్ పేరుతో కాలయాపన చేస్తున్నట్లు తెలిపారు. పట్టాల పేరుతో పత్రాలు పంపిణీ చేసి లబ్ధిదారులకు పొజిషన్ చూపడం లేదని విమర్శించారు ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యురాలు కంకణాల రమాదేవి, నగర కార్యదర్శివర్గ సభ్యులు జి.రమేష్, తంబి శ్రీనివాసులు, నగర కమిటీ సభ్యులు సయ్యద్ హుస్సేన్, టి. మహేష్, బివి.రావు, కె. శ్రీనివాసులు,సిహెచ్.వినోద్, రాజేశ్వరి, భానుమూర్తి, కష్ణచైతన్య, కె. వీరాస్వామి, రావూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.




అశోక్ నగర్‌లో మురుగు కాలువను పరిశీలిస్తున్న సిపిఎం బృందం

మహిళల భద్రతకు రక్షణ కవచం 'శక్తియాప్'

బాపట్ల తుషార్ దూడి

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

'శక్తి యాప్' మహిళల భద్రతకు రక్షణ కవచం లాంటిదని బాపట్ల ఎస్‌పి తుషార్ దూడి తెలిపారు. శక్తియాప్' మహిళలకు ఏవిధంగా ఉపయోగపడుతుంది. దాని వినియోగించుకునే విధానం గురించి ఎస్‌పి శుక్రవారం వివరించారు.రాష్ట్ర ప్రభుత్వం మహిళలు, బాలికల భద్రత కోసం శక్తి యాప్‌ను ప్రవేశపెట్టిందన్నారు. ఈ యాప్ మహిళలపై వేధింపులు, ఇతర హింసాత్మక ఘటనలను నివారించటానికి ఉపయోగపడుతుందన్నారు.



శక్తి యాప్ లోగో

మహిళలు, విద్యార్థినులు తమ సెల్ ఫోన్లలో శక్తి యాప్‌ను నిక్షిప్తం చేసుకోవాలన్నారు. ఆపద సమయంలో యాప్‌ను వినియోగించుకొని పోలీసుల నుంచి తక్షణ సహాయం, సహకారం పొంద వచ్చునన్నారు. ఆపదలో ఉన్న మహిళలు యాప్‌లోని ఎస్ఒఎస్ బటన్ ప్రెస్ చేస్తే వారు ఉన్న ప్రాంతం వివరాలను సమీపంలోని పోలీస్ స్టేషన్‌లోని డయల్ 112 నెంబరుకు చేరుతుందన్నారు. దీంతో పోలీసులు అప్రమత్తమై ఘటన స్థలానికి చేరుకొని రక్షణ కల్పిస్తారని తెలిపారు.

'శక్తి యాప్' ను ఎలా ఫోన్లో నిక్షిప్తం చేయాలి..

తొలుత ఫోన్‌లోని గూగుల్ ప్లే స్టోర్ ద్వారా శక్తి యాప్ ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. వారి వ్యక్తిగత వివరాలను నమోదు చేసుకోవాలి. ఒటిపితో ఫోన్ నెంబర్ అనుసంధానం చేసుకోవాలి. అత్యవసర సమయంలో సంప్రదించాల్సిన నెంబర్లను ఎంట్రీ చేయాలి. ఏదైనా ప్రమాదంలో చిక్కుకుంటే యాప్ ఓపెన్ చేసి ఎస్ఒఎస్ బటన్‌పై ప్రెస్ చేస్తే బాధితులు వున్న ప్రదేశాన్ని గుర్తించి పోలీసులు తక్షణమే స్పందిస్తారు. నైట్ షెల్టర్లు, సఖీ ఒన్ స్టాప్ సెంటర్ వివరాలు అందులో అందుబాటులో వుంటాయి.

శక్తి యాప్ వల్ల ప్రయోజనాలు ఇవే..

మహిళలు ఏదైనా ఆపదలో ఉన్నప్పుడు ఈ యాప్ ద్వారా పోలీసులకు వెంటనే సమాచారం అందించవచ్చు. ఓ క్లిక్ ఎస్ఒఎస్ అలర్ట్ అవుతుంది.ఓ క్లిక్ నొక్కితే పోలీసులకు, కుటుంబసభ్యులకు, స్నేహితులకు సందేశం చేరుతోంది. జియో, లోకేషన్ ట్రాకింగ్, అత్యవసర పరిస్థితుల్లో పోలీస్ కంట్రోల్ రూమ్ మహిళ ఉన్న ప్రదేశాన్ని తక్షణమే గుర్తించి సహాయం అందించగలదు.. సమాచార అవగాహన, మహిళా హక్కులు, రక్షణ చట్టాలు, ప్రభుత్వ నిబంధనల గురించి పూర్తి వివరాలు పొందవచ్చు. ప్రత్యక్ష పోలీస్ సహాయం, సమీపంలోని పోలీస్ స్టేషన్ సమాచారం, హెల్ప్ లైన్ నంబర్లను యాప్‌లో ఉంటాయి.



ఎస్‌పి తుషార్ దూడి

శక్తి బృదాలు ఏర్పాటు

బాపట్ల జిల్లాలో శక్తి బందాలు ఏర్పాటు చేసినట్లు ఎస్‌పి తెలిపారు. ఒక్కొక్క బందంలో 6 గురు సభ్యులు ఉంటారన్నారు. ప్రతి బందానికి ఎస్ఐ ఇన్‌ఛార్జిగా ఉంటారన్నారు. ప్రస్తుతం జిల్లా లోని రేపల్లె, చీరాల, బాపట్ల సబ్ డివిజన్ పరిధిలలో మూడు బందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మహిళలు, బాలికలు, విద్యార్థినులు, మహిళా ఉద్యోగినులు, గృహిణులు అత్యవసర పరిస్థితుల్లో శక్తి యాప్ వినియోగించుకొని శక్తి బృందాల ద్వారా భద్రత పొందవచ్చునని తెలిపారు.

బాలోత్సవం విజయవంతానికి ..

సహకరించిన వారికి కృతజ్ఞతలు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ఒంగోలులో గత నెల16 నిర్వహించిన ప్రకాశం బాలోత్సవం విజయవంతానికి కృషిచేసిన వారికి బాలోత్సవ కమిటీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బండారు లక్ష్మీనారాయణ, కలపాల సుబ్రహ్మణ్యం అభినందనలు తెలిపారు. స్థానిక ఎల్‌బిజి భవన్‌లో బాలోత్సవం సమీక్షా సమావేశం కమిటీ కార్యనిర్వాహక అధ్యక్షుడు డి. వీరాంజనేయులు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షుడు బండారు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ బాలోత్సవంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 4,000 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు తెలిపారు. బాలోత్సవం నిర్వహణకు అనుమతులు ఇచ్చిన జిల్లా కలెక్టర్ ఎ. తమీమ్ అన్సారియా , బాలోత్సవంలో పాల్గొన్న ఎస్‌పి దామోదర్ , ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ రావు, డిఇఒ ఎ.కిరణ్ కుమార్ ,ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత , భ్రమరా టౌన్షిప్ అధినేత సతీష్ ,మండవ మురళీకష్ణ, అమరావతి బాలోత్సవం రాష్ట్ర కార్యదర్శి యువి.రామరాజు ,టి. ప్రేమ్ నాథ్, భగీరథ కెమికల్స్, ఆనంద్ గ్రానైట్స్ యాజమాన్యం , డాక్టర్ బి.జవహర్,ఎవి. పుల్లారావు, కెనరా బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, యూనియన్ బ్యాంక్ రీజినల్ మేనేజర్లకు, ఎవి. రమణారెడ్డి గూడ రామ్మోహన్ ధన్యవాదాలు తెలిపారు. బాలోత్సవం కమిటీ ప్రధాన కార్యదర్శి కె.సుబ్రహ్మణ్యం, కోశాధికారి ఎస్.రవి మాట్లాడుతూ మొత్తం 95 పాఠశాలల నుంచి విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. ఆయా పాఠశాలల యాజమాన్యాలకు, ప్రధానోపాధ్యాయులకు కతజ్ఞతలు తెలిపారు. ఈ బాలోత్సవం విజయవంతానికి దాదాపు 2000 మంది ఉపాధ్యాయులు ఆర్థిక సహకారం అందించారనీ, వారందరికీ కతజ్ఞతలు తెలిపారు. బాలోత్సవ విజయవంతానికి పాట రచించి పాడిన ఎస్.కామేశ్వరరావుకు ప్రత్యేక కతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాలోత్సవం అకాడమిక్ కన్వీనర్లు డిఎల్. ప్రసాద్, జి.ఉమామహేశ్వరి, ఎస్.సురేష్, ˆల్చరల్ కన్వీనర్ షేక్ అబ్దుల్ హై, ఏర్పాట్ల కమిటీ కన్వీనర్లు దామా శ్రీనివాసులు, వి.బాలకోటయ్య, రిజిస్ట్రేషన్ కన్వీనర్ సిహెచ్. వినోద్, వీరాస్వామి, వాలంటీర్స్ బాధ్యులు కెఎఫ్.బాబు ,బహుమతుల కమిటీ సభ్యులు ఎస్‌వి.రంగారెడ్డి, బి.తిరుపతయ్య, యు.భాస్కర్, ఫుడ్ కమిటీ సభ్యులు కె. నరసింహారావు, సోషల్ మీడియా కమిటీ సభ్యుడు సి.హెచ్.జయప్రకాష్, పర్యావరణ కమిటీ సభ్యుడు నాయుడు మాల్యాద్రి, రోటరీ క్లబ్ నాయకులు నర్రా సురేంద్రబాబు, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బండారు లక్ష్మీనారాయణ